నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

తెలంగాణకు హరితహారం

హైదరాబాద్ శనివారం 4-7-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 292 పేజీలు: 4 వెల: రూ.1/-

సరిహద్దుల్లో ప్రధాని మోడీ ఆకస్మిక పర్యటన

త్రివిధ దళాల చీఫ్ బిపిన్ రావత్, నరవాణెలితో కలసి పరిశీలన
సరి హద్దుల్లో సైన్యానికి భుజం తట్టి ప్రోత్సాహం
అక్కడే సరిహద్దు సమస్యలపై అధికారులతో సమీక్ష

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్రమోడీ శుక్రవారం ఉదయం లడఖ్‌లోని సరిహద్దుల్లో ఆకస్మిక పర్యటన చేసారు. ప్రధాని షెడ్యూల్ లో లేని ఈ పర్యటనకు ముందుగానే రహస్య ఏర్పాట్లు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ప్రధానితో పాటు త్రివిధ దళాధిపతి బిపిన్ రావత్ కూడా ఉన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికుల్లో మనోస్థైర్యాన్ని నింపడానికి ప్రధాని లడఖ్ సరిహద్దులో పర్యటించారు. మోదీ పర్యటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం అయ్యాయి. వీడియోలో మోడీ కూడా సైనికుల దుస్తుల్లోనే ఉన్నారు. కరోనా భయాన్ని విడిచి ఆయన సైనికులకు కరచాలనం చేయడం విశేషం. అంతే కాకుండా సైనికులకు సెల్యూట్ చేసి, వారి భుజాలు తడుతూ అభినందించారు. భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో మోడీ అకస్మాత్తుగా సరిహద్దుల్లో పర్యటించటం గమనార్హం.

చైనాతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోడీ అనూహ్యంగా లేహ్‌లోని సరిహద్దు ప్రాంతాలను సందర్శించారు. త్రివిధ దళాల అధిపతి బిపిన్ రావత్‌తో పాటు ఆర్మీ చీఫ్ నరవాణెళిలను వెంటబెట్టుకుని ఆయన సరిహద్దుల్లో సైనికులను కలిశారు. లడఖ్‌లోని గాల్వన్ లోయలో చైనా సైనికులతో జూన్ 15వ తేదీన జరిగిన ఘర్షణలో 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందిన తరవాత ఉద్రిక్తలు పెరిగాయి. చైనాతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో.. ప్రధాని మోదీ అకస్మాత్తుగా లేహ్ వెళ్లారు. అక్కడ ఆయన సైనికులతో మాట్లాడనున్నారు. ప్రస్తుతం లడఖ్ సరిహద్దుల్లో టెన్షన్ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ.. అక్కడి పరిస్థితిని స్వయంగా సమీక్షించేందుకు వెళ్లారు. చైనా మిలిటరీ అధికారులతో జరుగుతున్న చర్చల పక్రియను కూడా ఆయన అడిగి తెలుసుకో నున్నారు. వాస్తవానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేహ్‌లో పర్యటించాల్సి ఉంది. కానీ ఆయన షెడ్యూల్‌ను మార్చేశారు. దీంతో ఉదయం మోదీ .. లడఖ్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ హఠాత్తుగా లడఖ్ పర్యటనకు రావడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. లడఖ్‌లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో... అక్కడ పరిస్థితిని భారత్ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ హఠాత్తుగా లడఖ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానితో పాటు సైనిక ఉన్నతాధికారులు లడఖ్ చేరుకున్నారు. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తయిన ప్రాంతంలో ఉండే జంక్సర్ రేంజ్‌కు ప్రధాని వెళ్లినట్టు తెలుస్తోంది. గాల్వన్ ఘటనలో గాయపడి లేహ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైనికులను ప్రధాని మోదీ పరామర్శించనున్నారు. వారిలో మనోధైర్యం నింపనున్నారు. సాధారణంగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండే లడఖ్ సరిహద్దు ప్రాంతాలకు ప్రముఖులు పెద్దగా వెళ్లరు. కానీ ప్రధాని నరేంద్రమోదీ మాత్రం ఈ విషయంలో ముందడుగు వేశారు. స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులు తెలుసుకోవాలని నిర్ణయించారు. ఆ వెంటనే ఆకస్మికంగా లడక్‌లో ల్యాండ్ అయ్యారు. ఇప్పటికే చైనాకు ట్రేడ్ విషయంలో అనేక షాక్‌లు ఇస్తున్న భారత్... సరిహద్దుల్లో ధీటైన జవాబు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉందనే సంకేతాలు పంపేందుకే ప్రధాని నరేంద్రమోదీ లడఖ్‌లో పర్యటిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఇలా లడక్ లో పర్యటించడం సైనికుల్లో ఆత్మస్థైర్యం నింపినట్టు అవుతోంది. ప్రధాని మోదీతో పాటు త్రివిధ దళాధిపతి బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ నరవాణెళిలు కూడా లడక్‌లో పర్యటించారు. చైనాతో జరిగిన చర్చల్లో భారత్ తరపున హాజరైన లెఫ్టినెంట్ జనరల్ హరీందర్ సింగ్ ప్రధానిమోదీకి అన్ని వివరాలు తెలిపారు. చైనా, భారత్ సైనికుల మధ్య జూన్ 15 జరిగిన వివాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని మోదీ పరామర్శించారు.

లద్దాఖ్‌లోని లేహ్‌లో పర్యటించిన సందర్భంగా అక్కడి సైనికులతో సమావేశమైన ప్రధాని మోడీ

మయన్మార్ గని ప్రమాదంలో 162కు పెరిగిన మృతులు

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): మయాన్మార్‌లో ఓ గనివద్ద కొండ చరియలు విరిగిపడి చనిపోయిన వారి సంఖ్య 162 కు చేరుకుంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. కచిన్ రాష్ట్రంలో హపకంట్ సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద పచ్చరాయి గని ఉంది. దీనిని తవ్వి తీసిన మట్టి పక్కనపోస్తుంటారు. అయితే, ఈ గనిలో పనిచేస్తున్న కార్మికులు అక్కడే తాత్కాలిక చిన్న, చిన్న షెల్టర్లు ఏర్పాటు చేసుకొని ఉంటుంటున్నారు. అయితే, కొన్ని కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో పక్కన పోసిన మట్టి.. కార్మికుల షెల్టర్లపై పడటంతో పలువురు చనిపోయారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో 50 మంది చినిపోయినా.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంతా అంచనా వేశారు. అయితే, ఇప్పటివరకూ 162 మృతదేహాలు వెలికితీశారు. మట్టి దిబ్బల కింద చాలా మంది సజీవ సమాధి అయిపోయారని అంటున్నారు. 2015లో కూడా ఇలాంటి ఘటన ఇదే ప్రాంతంలో చోటు చేసుకుంది. ఆ సమయంలో 113 మంది మృతి చెందారు.

కేంద్రం మరో కీలక నిర్ణయం

చైనా విద్యుత్ పరికారాల దిగుమతుల నిషేధం

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): భారత్, చైనా సరిహద్దులో ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. చైనా విద్యుత్తు పరికరాల దిగుమతిపై నిషేధం విధించే చర్యలు చేపట్టింది. సరైన అనుమతి లేకుండా చైనా, పాకిస్థాన్ నుంచి ఎలాంటి విద్యుత్తు పరికరాలను దిగుమతి చేసుకోకూడదని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ శుక్రవారం తెలిపారు. చైనా, పాకిస్థాన్ దేశాలు మన దేశంలోకి చొరబడి మన సైనికులను చంపుతున్నాయని ఆయన ఆరోపించారు. ఆయా దేశాల నుంచి దిగుమతుల వల్ల అక్కడ మాత్రమే ఉద్యోగాల కల్పన జరుగుతున్నదని, మన దేశంలో కాదని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో చైనా, పాకిస్థాన్ దేశాల దిగుమతులను అనుమతి పొందాల్సిన జాబితాలో చేర్చినట్లు ఆర్కే సింగ్ చెప్పారు. దేశీయ విద్యుత్తు పరికరాల తయారీ పరిశ్రమల ప్రతినిధులతో ఇటీవల జరిగిన సమావేశంలో వారికి ఇదే విషయాన్ని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ విద్యుత్తు వ్యవస్థకు అవసరమైన అన్నింటినీ మనం సొంతంగా తయారు చేసుకొంటున్నామన్నారు. మన దేశానికి ఆ శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని, విద్యుత్తు పరికరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన దన్నారు. 2018- 19లో రూ.71 వేల కోట్ల విలువైన విద్యుత్తు పరికరాలను దిగుమతి చేసుకున్నామని, ఇందులో చైనా దిగుమతులు రూ.21 వేల కోట్లు అని ఆర్కే సింగ్ వివరించారు.

లఫ్కర్ బోనాలకు జనాలకు నో

ఇంటికే బోనాలు పరిమితం
ఉజ్జయిని ఆలయంలో పూజారుల సమక్షంలో బోనాలు
అధికారులతో సమీక్షలో మంత్రి తలసాని వెల్లడి

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నేపథ్యంలో ఈ ఏడాది ప్రతిఒక్కరు వారి ఇళ్లలోనే బోనాల పండుగ జరుపుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బోనాల సందర్భంగా ఎలాంటి ఊరేగింపులు ఉండవని ప్రకటించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాలి బోనాల జాతర నిర్వహణపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఆలయ ఈవో అనిల్‌కుమార్, పండితులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. కరోనా మహమ్మారి దృష్ట్యా ఆలయంలోనే వేదపండితులు, ట్రస్ట్ సభ్యుల మధ్య జాతర నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా జరిగే పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని వెల్లడించారు. బోనాల వేడుకలను ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. వచ్చే శుక్రవారం, ఆదివారం, సోమవారాల్లో భక్తులకు ప్రవేశం లేదన్నారు. ఆదివారం నాటి పూజలు, సోమవారం జరిగే రంగం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. జాతరలో తానుకూడా పాల్గొనడం లేదని తెలిపారు. కార్యక్రమాలు యథావిధిగా జరిగినా ప్రజల భాగస్వామ్యం ఉండన్నారు.

ప్రగతిభవన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కరోనా

దాదాపు 20మందికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం
అధికారుల పర్యవేక్షణలో పూర్తిస్థాయి శానిటైజ్

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ లో కరోనా విలయతాండవం చేస్తోంది. టీఆర్ఎస్ పార్టీకి చెందిన లీడర్లు కరోనా బారిన పడి వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. తాజాగా కరోనా వైరస్ ప్రగతిభవన్ లోకి ప్రవేశించింది. వారం రోజుల్లో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న 20 మంది సిబ్బందికి పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ప్రగతి భవన్ ను వైద్యాధికారుల పర్యవేక్షణలో సిబ్బంది శానిటైజ్ చేస్తున్నారు. పాజిటివ్ కేసులు పెరుగుతుండడంతో సీఎం కేసిఆర్ ఫామ్ హౌజ్ నుంచే తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తున్నా లాక్డౌన్ పై పునరాలోచనలు జరుపుతోంది సర్కారు. లాక్డౌన్ శాశ్వత పరిష్కారం కాదని భావించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ దశలో వారం రోజులుగా ఒక్కొక్కరిలో కరోనా లక్షణాలు బయటపడుతుండడంతో పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి లక్షణాలు లేకపోయినా టెస్టులు చేయించుకున్నారు. మొత్తంగా 20 మంది సిబ్బందికి పాజిటీవ్ అని తేలింది. వైరస్ సోకినవారిలో ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. దీంతో వైద్యాధికారుల పర్యవేక్షణలో ప్రగతి భవన్‌ను అధికారులు శానిటైజ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల కాలంలో ఎక్కువగా ఫామ్ హౌస్‌లోనే ఉంటున్నారు. ఇక నుంచి పూర్తిగా పామ్ హౌస్ నుంచి అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో ఎక్కువగా ఫామ్ హౌస్‌లోనే ఉంటున్నప్పటికీ అధికారిక సమీక్షలు మాత్రం ప్రగతి భవన్‌లో నిర్వహించేవారు. ఇటీవల కాలంలో కరోనా కేసులు పెరిగిపోవడంతో ప్రెస్ మీట్‌లు తగ్గించారు. గత మూడు రోజులుగా హైదరాబాద్‌లో లాక్ డౌన్ విధింపుపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చలు జరుపుతున్నారు. అయితే ఏ నిర్ణయానికి రాలేకపోయారు. తెలంగాణలో కరోనా ప్రమాదకరంగా విస్తరిస్తోంది. హైదరాబాద్‌లోనే రోజుకు దాదాపుగా వెయ్యి కేసులు నమోదయ్యే పరిస్థితి నెలకొంది.

ముంబైలో భారీ వర్షాలకు జలమయం అయిన రహదారులు

రాజ్యకాంక్ష ఉంటే తోకముడవక తప్పదు

త్యాగాలు చేసేందుకు లడక్ సిద్ధంగా ఉంది
వేణువు ఆలాపనే కాదు..సుదర్శన ప్రయోగమూ తెలుసు
చైనాకు పరోక్షంగా గట్టి హెచ్చరికలు
లాద్దాక్‌లో సైనికులను ఉత్తేజ పరిచిన ప్రధాని మోడీ

లేహ్‌లో ఆకస్మిక పర్యటనలో భాగంగా అక్కడి సైనికులను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): మాతృభూమి కోసం సైనికుల సాహసాలు, అంకిత భావం అసామాన్యమని ప్రధాని మోదీ కొనియాడారు. విస్తరణవాదానికి కాలం చెల్లించదని, ఇది అభివృద్ధి శకం అని పరోక్షంగా చైనాకు చురకలు వేశారు. లడక్‌లోని నీమూలో శుక్రవారం ఆకస్మిక పర్యటన జరిపిన ప్రధాని అక్కడి ఫార్వార్డ్ పోస్ట్‌లో సైనికులను ఉద్దేశించి ఉత్తేజభరితమైన ప్రసంగం చేశారు. విస్తరణ వాద శకం ముగిసింది. ఇది అభివృద్ధి శకం. విస్తరణ శక్తులు మట్టికరవడమో, తోకముడవడమో జరిగినట్టు చరిత్ర చెబుతోందని ప్రధాని ఘాటుగా వ్యాఖ్యానించారు. అయితే, తన ప్రసంగంలో చైనా పేరును ఎక్కడా నేరుగా మోదీ ప్రస్తావించలేదు. లడక్ ప్రజలు తమ ప్రాంతాన్ని విడగొట్టేందుకు ఎవరు ఎలాంటి ప్రయత్నాలు జరిపినా తిప్పికొడుతూ వచ్చారని ప్రధాని గుర్తుచేశారు. దేశానికి లడక్ శిరస్సు వంటింది. 130 కోట్ల మంది భారత ప్రజలకు గర్వకారణం. దేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసేందుకు సిద్ధపడే వారికే ఈ భూమి సొంతం. ఈ ప్రాంతాన్ని వేరుచేసేందుకు జరిపే ఎలాంటి ప్రయత్నాన్నైనా జాతీయభావాలు పుష్కలంగా ఉన్న లడక్ ప్రజలు తిప్పికొడతారు' అని మోదీ స్పష్టం చేశారు. వేణువు ఆలపించే కృష్ణుడిని ఆరాధించే ప్రజలే, సుదర్శన చక్రం ప్రయోగించే కృష్ణుడి సిద్ధాంతాన్ని కూడా అనుసరిస్తుంటారని మోదీ గుర్తుచేశారు.మీరు చూపించిన ధైర్యసాహసాలు.. ప్రపంచదేశాలకు భారతీయ శక్తిసామర్థ్యాలను తెలియజేసిందని ప్రధాని మోదీ సైనికులను ఉద్దేశించి మాట్లాడారు. లడఖ్‌లోని లేహ్ వెళ్లిన ప్రధాని అక్కడ సైనికులకు ధైర్యాన్ని నూరిపోశారు. చైనాతో సరిహద్దు ఉద్రిక్త నెలకొన్న నేపథ్యంలో.. ప్రధాని మోదీ లేహ్‌కు ఆకస్మిక పర్యటన చేశారు. మీలో ఉన్న ధైర్యం.. మీరు పోస్టింగ్‌లో ఉన్న ప్రదేశం కన్నా ఎత్తైందని మోదీ సైనికులతో పేర్కొన్నారు. గాల్వన్ లోయలో జరిగిన దాడిలో అమరులైన సైనికులకు నివాళి అర్పిస్తున్నట్లు మోదీ తెలిపారు. మీ త్యాగాలు, బలిదానాలు, పోరాటం వల్లే ఆత్మనిర్భర భారత్ సంకల్పం నెరవేరుతుందని సైనికులను ఉద్దేశించి మోదీ తెలిపారు. 14కార్ప్స్ దళాలు చూపిన తెగువను ప్రతి ఒక్కరూ మాట్లాడుకుంటారన్నారు. మీరు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి ఒకరి ఇంట్లో ప్రతిధ్వనిస్తున్నాయని ప్రధాని తెలిపారు. మీలోని అగ్నిని, ఆవేశాన్ని.. భారతమాత శత్రువులు చూశారన్నారు. బలహీనంగా ఉన్నవారెప్పుడూ శాంతిని కాంక్షించరని, శాంతి కావాలంటే ధైర్యం చాలా ముఖ్యమైందని ప్రధాని అన్నారు. ప్రపంచ యుద్ధాల సమయంలోనైనా, శాంతి సమయంలోనైనా, అవసరం వచ్చినప్పుడు మన సైనికుల ధైర్యాన్ని ప్రపంచం చూసిందని, శాంతి కోసం కూడా మన సైనికులు పనిచేశారని మోదీ అన్నారు. ఉత్తమమైన మానవ విలువల కోసం మనం పనిచేశామని ప్రధాని తెలిపారు. ఇక్కడ నేను మహిళా సైనికుల్ని చూస్తున్నానని, కదనరంగంలో ఇలాంటి సందర్భం ప్రేరణను కలిగిస్తుందని, మీ వైభవం గురించే నేను మాట్లాడుతున్నానని సైనికులను ఉద్దేశించి మోదీ అన్నారు. సైనిక మౌళికసదుపాయాలపై వ్యయాన్ని సరిహద్దుల్లో మూడు రెట్లు పెంచామన్నారు. లేహ్ నుంచి.. లడఖ్, సియాచిన్, కార్గిల్, గాల్వన్ సెలయేళ్ల నుంచి .. ప్రతి పర్వతం, ప్రతి కొండ.. భారతీయ సైనికుల సత్తాను చూసిందన్నారు.

మోడీ పర్యటనతో ఆత్మస్థయిర్యం

అకస్మాత్తుగా ప్రధాని మోదీ శుక్రవారం లడఖ్‌లో పర్యటించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పందించారు. కేంద్ర హోంమంత్రి షా ట్వీట్ చేస్తూ.. మోదీ ముందుండి నడిపిస్తున్నారు. అత్యంత ధైర్యవంతులైన ఆర్మీ, వైమానిక దళం, ఐటీబీపీ సిబ్బందితో ప్రధాని మోదీ ఉన్నారు. ఈ పర్యటన కచ్చితంగా జవాన్ల ఆత్మ స్థైర్యాన్ని పెంచుతుందంటూ షా ట్వీట్ చేశారు. ఇంతటి క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ లడఖ్‌లో పర్యటించడంతో జవాన్ల ఆత్మ స్థైర్యం కచ్చితంగా రెట్టింపవుతుంది. భారత జవాన్ల నీడలో దేశ సరిహద్దులు ఎప్పుడూ సురక్షితమే అంటూ రాజ్‌నాథ్ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ శుక్రవారం అకస్మాత్తుగా లద్దాఖ్‌లో పర్యటించారు. గాల్వాన్ లోయలో ఇరు దేశాల బలగాల మధ్య ఘర్షణాత్మక వైఖరి చోటు చేసుకున్న తరుణంలో మోదీ పర్యటనకు ప్రాధాన్యం చోటు చేసుకుంది. మోదీతో పాటు సీడీఎస్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ నరవాణెళి కూడా ఉన్నారు.

స్వాగతించిన కాంగ్రెస్

లడఖ్‌లో ప్రధాని మోదీ పర్యటనపై కాంగ్రెస్ స్పందించింది. లోకసభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ... మోదీ పర్యటన కచ్చితంగా జవాన్లకు మంచి ప్రేరణను కల్పిస్తుందని వ్యాఖ్యానించారు. ఉద్రిక్తత జరిగిన ప్రాంతాలను ఆయన ఇంతకు ముందే సందర్శించి ఉండాల్సిందని అన్నారు. దేశ భూభాగంలో చైనా చొరబాటుదారులు ఎక్కడ ఉన్నా వారిని వెంటనే తరిమి కొట్టాలని అధీర్ డిమాండ్ చేశారు.

పాక్‌లో ఘోర ప్రమాదం

19 మంది సిక్కు యాత్రికుల మృతి

లాహోర్,జులై3(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఓ రైల్వేక్రాసింగ్ వద్ద బస్సును అతివేగంతో వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 19 మంది సిక్కు యాత్రికులు మరణించారు. మరికొందరికి గాయాలు కావడంతో వారిని ఆస్పతికి తరలించి చికత్స అందిస్తున్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని పీకువురా జిల్లా ఫరీదాబాద్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఒకే ఫ్యామిలీకి చెందిన 25 మంది యాత్రికులు మినీ బస్సులో నంకానా సాహెబ్‌కు వెళ్లారు. అక్కడ ప్రార్థనల అనంతరం గురుద్వారా సచ్చ సౌధాకు వెళ్లారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ వద్ద రైల్వే క్రాసింగ్ దాటుతున్న సమయంలో కరాచీ-లాహోర్ షా హుస్సేన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది.

ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

ముంబై,జులై3(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర రాజధాని ముంబైలో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుండటంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

రోడ్లపై భారీగా వరద నీరు నిలిచిం ది. దీంతో వివిధ అవసరాల నిమిత్తం బయటకు వచ్చిన జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వడాలా, కింగ్స్ సర్కిల్, హిండ్‌మాతా ఏరియాల్లో రహదారులు చెరువులను తలపించాయి. దీంతో రంగంలోకి దిగిన ముంబై పోలీసులు, విపత్తు నిర్వహణ బలగాలు సహాయక చర్యలు చేపట్టాయి. డ్రైనేజీల్లో అడ్డంకులను తొలగించి వరదనీరు వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు.

విద్యాసంవత్సరం మొదలు కాకుండానే ఆన్‌లైన్ తరగతులా?

సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు
సబ్‌కమిటీ పరిశీలనలో ఆన్‌లైన్ తరగతున్న ప్రభుత్వం

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ఆన్‌లైన్ క్లాసెస్ ఎందుకు నిర్వహిస్తున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.అంతేగాక ఆన్‌లైన్ క్లాసుల వల్ల ఆర్థికంగా వెనుకబడిన వారు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి న్యాయం జరుగుతుందో ఈ నెల 13వ తేదీలోగా లిఖితపూర్వకంగా నిర్దిష్ట ప్రణాళికను సమర్పించాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ పిటిషన్‌పై శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రభుత్వం దీనిపై ఇంతవరకు ఎలాంటి నివేదిక సమర్పించకపోవడంతో హైకోర్టు ప్రశ్నించింది. ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ఇంకా ప్రారంభించలేదని క్యాబినెట్ సమావేశం అనంతరం దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారు. అదే విధంగా ఆన్‌లైన్ క్లాసెస్‌పై ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ ఇంప్లీడ్(ఇస్మా) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీబీఎస్ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండు నెలల క్రితమే విద్యా సంవత్సరం ప్రారంభించిందని ఇస్మా తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆన్‌లైన్ క్లాసుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిడి చేయడం లేదని, ఇది వారికి ఆప్షన్ మాత్రమేనని ఇస్మా పిటిషన్‌లో పేర్కొంది. సీబీఎస్ఈపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ లేదని ఇస్మా న్యాయవాది కోర్టుకు స్పష్టం చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఇస్మాకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది. ఆన్‌లైన్ తరగతులపై కేబినెట్ సబ్ కమిటీ పరిశీలిస్తుందని తెలిపిన ప్రభుత్వం ఈ నెల 31వరకు విద్యా సంస్థలు తెరవద్దని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలిపింది. ఈ నెల తర్వాతే విద్యా సంవత్సరం పై నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పిన ప్రభుత్వం విద్యా సంవత్సరం మొదలు కాక ముందే ఆన్ లైన్ తరగతులను ఎలా అనుమతిస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. ఆన్ లైన్ తరగతులకు అనుమతి ఇవ్వలేదని ప్రభుత్వం తెలిపింది. అయితే ఓవైపు అనుమతి ఇవ్వలేదంటునే .. మరోవైపు అడ్డుకోవడం లేదని ప్రభుత్వం ధ్వంద్వ వైఖరితో దాగుడు మూతలు ఆడకూడదని, మహారాష్ట్ర మాదిరిగా స్పష్టమైన నిర్ణయం ఎందుకు తీసుకోవడం లేదు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే తరగతులు జరగక పోతే విద్యార్థుల కెరీర్ స్థంభించిపోతుంది అని తెలిపిన విద్యా సంస్థల న్యాయవాది వారి కెరీర్ కోసం నెల రోజులుగా ఆన్ లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆన్ లైన్ తరగతుల కోసం ఒక్కో ఇంట్లో రెండు మూడు ల్యాప్ టాప్ లు కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించిన హై కోర్టు ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చుని నిర్ణయాలు తీసుకోవడం కాదు గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నీ తెలిపింది. కరోనా కారణంగా కార్మికులు, న్యాయవ్యవస్థ తో పాటు ప్రపంచ మానవాళి జీవితమే స్తంభి ంచింది అని తెలిపిన హైకోర్టుకేంద్ర ప్రభు త్వం, సీబీఎస్ఈ, ఎన్సిటీఈని ప్రతివాదులుగా చేర్చాలని పిటిషనర్ కు ఆదేశాలు జారీ చేసింది.

చరిత్రలో నేటినిజం



శ్లో॥ భారత సత్సంప్రదాయములను
ఆచరణ పోషించి నట్టి శిష్టాత్ముడు..గు
ప్పా లిలావే సందాన్వై
శిరజ నేత్రుండు గురిసె నిశ్శలయు శమునే!!

(జులై 4 గుల్జారీలాల్‌నందా జననం...)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం
శనివారం 4-7-2020

వైద్యరంగం డొల్లతనాన్ని బయటపెట్టిన కరోనా

లాక్‌డౌన్ ముందునాటి స్థితితో పోలిస్తే కరోనా వైరస్ తీవ్రత అనూహ్యంగా పెరుగుతోంది. రోజుకోరీతిలో దాని లెక్కలు మారుతున్నాయి. మరణాల సంఖ్యకూడా అలాగే పెరుగుతోంది. ఈ దశలో గణాంకాలు చూసి విశ్లేషిస్తూ కేసుల సంఖ్య తక్కువగా ఉందనో లేక..మరణాల రేటు తగ్గిందనో చెప్పడం సరికాదు. ప్రజల భయాందోళనలు తొలగించే ప్రయత్నాలు చేయాలి. ఇది కేంద్ర రాష్ట్రాల సమిష్టి బాధ్యత. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్రాలు సరిగా వినియోగించడం లేదన్న ఆరోపణలు పక్కన పెట్టి నిధులు ఎంత ఇచ్చిందీ సక్రమంగా చెప్పి..వాటిని రాష్ట్రాలు కరోనా నిర్మూలనకు ఉపయోగిస్తున్నాయో లేదో తక్షన చర్యలకు ఉపక్రమించాలి. ఇకపోతే దేశవ్యాప్తంగా కరోనా కేసుల ఉధృతి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలను కలుపుకుని వైద్య సేవలను, చికిత్సలను పటిష్టం చేయాలి. ప్రధాన ఆస్పత్రుల్లో సిబ్బందిని పెంచి, సౌకర్యాలు మెరుగు పర్చాలి. ఆస్పత్రుల్లో ఫలానది లేదన్న విధంగా పటిష్టం చేసి, ప్రజలకు నమ్మకం కలిగించాలి. ప్రైవేట్ ఆస్పత్రల్లో కూడా వైద్యాన్ని ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకుని రావాలి. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర,రాష్ట్రాలు కర్చు చేయాలి. ప్రజల ఆరోగ్యం కన్నా మరే ఇతర విసయాలు ముఖ్యం కాదు కనుక.. వైరస్‌ను ఎదుర్కొనేందుకు అసవరమైన ప్రాథమిక చికిత్సలకు సంబంధించి లోటు లేకుండా చేయాలి. అవసరమైతే కొన్ని అనవసర పథకాలకు నిధులను ఆపేయాలి. కరోనాను ఎదుర్కోవడంలో ఇంతవరకూ అనుసరిస్తూ వస్తున్న విధానాల వల్ల లభించిన ఫలితాలనూ, ముఖ్యంగా లాక్‌డౌన్ తొలగించాక రాష్ట్రాలు పొందిన అనుభవాలనూ పరస్పరం పంచుకోవాలి. మహమ్మారిని ఎదుర్కొనడానికి, లాక్‌డౌన్ పర్యవ సానంగా స్తంభించిన ఆర్థిక కార్యకలాపాలను పునరుద్ధరించడానికి అమలు చేస్తున్న వ్యూహాలను సమీక్షించు కోవాలి. ఇప్పటికీ వ్యాధిగ్రస్తుల శాతం తక్కువగా వుండటం, వేరే దేశాలతో పోలిస్తే వారిలో కోలుకునేవారి శాతం ఎంతో మెరుగ్గా వుండటం వంటి విశ్లేషణలను పక్కన పెట్టాలి. అసలు కరోనాను ఎదుర్కోవడమెలా.. అందుకు అనుసరించిన వ్యూహాలు విజయం సాధించాయా లేదన్న విశ్లేషణ చేయాలి. కనీవినీ ఎరుగని రీతిలో విరుచుకుపడిన కరోనా వైరస్‌ను ఎదుర్కొనడంలో మనం పాటించిన విధానాల్లో శాస్త్రీయత వుందో లేదో తెలిసే అవకాశం లేదు. మనకే కాదు...ప్రపంచంలో ఏ దేశానికీ ఆ వ్యాధి విస్తృతిపై, తీవ్రతపై పూర్తి అవగాహన కలగడంలేదు. వ్యాధి బయటపడిన చైనా కూడా లాక్‌డౌన్ ఎత్తేశాక పలుమార్లు మళ్లీ మళ్లీ విధించాల్సివస్తోంది. ఆచరణలో ఎదురవుతున్న అనుభవాలనుబట్టి ఎప్పటికప్పుడు దారులు పరుచుకుంటూ ముందుకు పోవడం తప్ప ఎవరికీ తమ విధానాలపైనా, వాటి ఫలితాలపైనా స్పష్టత లేదు. ఇకపోతే ఇప్పుడు ఎదురవుతున్న ఆర్థికపరమైన ఇబ్బందుల్ని అధిగమించడానికి కేంద్రం నేరుగా సాయం అందించాల్సి ఉంది. ఇకపోతే వైద్యపరంగా మనం ఎంతగా వెనకబడి ఉన్నామో...మన ఆరోగ్యరంగం లోటు పాట్లను ఈ కరోనా మహమ్మారి బయ టపెట్టింది. కొన్ని దశాబ్దాలుగా దేశం లో వైద్య ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేసిన ఫలితం ఇప్పుడు కొట్టొచ్చినట్టు కనబడుతోంది. చాలాచోట్ల ప్రభుత్వా సుపత్రుల్లో సరైన సదుపాయాలు లేవు. ప్రధాన నగరాలైన ముంబై, ఢిల్లీ, హైదరాబద్ లాంటి చోట్ల ఉన్న ప్రధాన ఆస్పత్రుల్లో కూడా పటిష్టమైన వైద్య సౌకర్యాలు లేవు.చికిత్స అందించడానికి సరిపడా వైద్యులు అందుబాటులో లేరు. ఇతర మౌలిక సదుపాయాల సంగతి ఇక చెప్పాల్సిన పనిలేదని ఇటీవలి పరిస్థితులు ప్రజలకు కళ్లకు కట్టాయి. వీటిని అధ్యయనం చేయడం జరిగింది కనుక భేషజాలకు పోకుండా ఆస్పత్రుల్లో అధునాతన సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన సమకూర్చాలి. ఈ విపత్కర సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉంది. కేంద్రం ఎప్పటికప్పుడు ఇస్తున్న మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాల్సిందే. పరిస్థితి ఇంకా పూర్తిగా అదుపులోకి రాకపోగా, దాన్ని ఎదుర్కొనడానికి మరిన్ని చర్యలు అవసరమని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వేగంగా వ్యాపిస్తున్న కరోనా వ్యాధి కారణంగా సామాన్యులు ఆందోళన చెందుతున్న వేళ ఆస్ప త్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం అన్నది సిగ్గుచేటు. వీటిని బాగు చేయడానికి పాలకులు ఎవరు కూడా తమ జేబులో నుంచి రూపాయి ఖర్చు చేయడం లేదు. అలాంటప్పుడు ఆస్పత్రుల్లో సౌకర్యాలు లేకుండా చేయడంలో అర్థం లేదు. ఇంతటి భయంక పరిస్తితుల్లో ఆస్పత్రులు అధ్వాన్నంగా ఉండడం క్షంతవ్యం కాదు. ఏ రాష్ట్రం అయినా ఆస్పత్రులను పటిష్టం చేసి, అధునాతనంగా తీర్చి దిద్దాల్సిందే. బాధ్యతాయుతంగా వ్యవహరించలేని అసమర్థత, అలక్ష్యం ఉన్న ప్రభుత్వాలను నిలదీయాల్సిందే. వీటన్నిటి కారణంగా, ఎవరికి వారే యమునాతీరే లాగా ప్రత్యేక విధానాలను అనుసరి స్తున్నారు. ఇటువంటి స్థితిని ఎదుర్కొనడంలో ప్రభుత్వాధినేతలు ఒక సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో విఫలమ వుతున్నారు. ఆయా ప్రభుత్వాలు ప్రజలతో వ్యవహరించే విషయంలో అనుసరిస్తూ వస్తున్న విధానాలు సరిగా ఉండడం లేదని తేలిపోయింది. ఆస్పత్రులు పటిష్టంగా ఉంటేనే ఆరోగ్య రంగం ప్రాణాలు రక్షిస్తుందనే విశ్వాసం వైద్యరంగం మీద ఉంటుంది. ప్రభుత్వం మీద, ప్రభుత్వ విధానాల మీద, ఆరోగ్య నిర్వహణా యంత్రాంగం మీద ప్రజలకు అపారమైన విశ్వాసం పెంచాల్సి ఉందని కరోనా నేపథ్యంలో మరోమారు రుజువయ్యింది. ఈ రంగం కోసం ఇప్పుడు ఎన్ని నిధులు అయినా వెచ్చించాలి. అధ్వాన్నంగా తయారైన వైద్యరంగాన్ని సంస్కరిం చాలి. మనకు అసవరమైన ఉత్పత్తులను మనమే తయారు చేసుకునే స్థాయికి రావాలి. స్వయం సమృద్ధి సాధించేలా వైద్య పరికరాలను ఉత్తపి చేసుకోవాలి.ఇంతగా శాస్త్ర సాంకేతిక అభివృద్ధి చెందిన దశలో, నైపుణ్యం ఉన్న యువతను వినియోగిం చుకుని ఆస్పత్రుల రూపురేకలు మార్చాలి. సిబ్బంది కొరత, ఉపకరణాల కొరత, బడ్జెట్ కొరత వంటి సమస్యలు లేకుండా చూసుకోవడం మినహా మనకు ఇప్పుడు ప్రాధాన్యం అంశాలు ఇతరత్రా ఉండరాదు. పరిశీలకులు, నిపుణులు, కేంద్ర బృందం సభ్యులు, న్యాయస్థానాలు పదేపదే చెబుతున్న వేళ కరోనా టెస్టుల సంఖ్యను పెంచాలి. ప్రజలకు అనేక సందేహాలు, భయాలు ఉన్న నేపథ్యలో వారికి భరోసా కల్పించడం ద్వారా కరోనాను సమిష్టిగా కేంద్రా,రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కో వాలి. అందుకు ఆస్పత్రులను పటిష్టం చేయడమే తక్షణ బాధ్యతగా గుర్తించాలి.

ఏకగ్రీవం పంచాయితీలకు అందని ప్రోత్సాహకం

-ఎదురుచూస్తున్న సర్పంచ్‌లు

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడం లేదు. గ్రామాభివృద్ధికి గ్రామస్థులు, ఆశావహులు ఏకతాటి పైకి వచ్చి ఏకగ్రీవంగా పాలకవర్గాలను ఎన్నుకున్నారు. వీరిని ప్రోత్సహించడానికి రాష్ట్రప్రభుత్వం రూ.పది లక్షల నజరానా ప్రకటించింది. జిల్లాల్లో ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి.

ఎన్నికలు ఏకగ్రీవమైతే ఎంతో ఖర్చు కలిసొస్తుందని భావించిన ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహించింది. గ్రామపంచాయతీల ఎన్నికల సందర్భంగా ఏకగ్రీవం కావడానికి తంటాలు పడిన అభ్యర్థులు బరిలో నిలిచిన వారికి పలు హామీలు గుప్పించారు. తమకూ ఎన్నికల ఖర్చు కలిసొస్తుందని రకరకాల హామీలు ఇచ్చారు. వారు కోరిన వార్డుల్లో పనులు చేసి పెడతామని చెప్పారు. ప్రభుత్వపరంగా వచ్చే రూ.10లక్షల ప్రోత్సాహక నిధులు అందుకు వెచ్చిస్తామని చెప్పారు. ఇపుడు ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటినా ప్రోత్సాహక సొమ్ము రాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. 2019 జనవరి, ఫిబ్రవరిలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర గ్రాంట్లను విడుదల చేస్తున్నాయి. వీటితో పాటు పంచాయతీ పరిధిలో వసూలయ్యే పన్నులు గ్రామాభివృద్ధికి వినియోగిస్తున్నారు. హరితహారం, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటిక మొదలైనవి గ్రామీణ ఉపాధిహామీ నిధులతో చేపడుతున్నారు. అయితే గ్రామాల సంపూర్ణాభివృద్ధికి ఈ నిధులు సరిపోవడం లేదు.

చిన్నారిని హత్య చేసిన కిరాతకుడు

-తల్లిపై కోపంతో చిన్నారి బలి

మేడ్చల్,జులై3(ఆర్ఎన్ఎ): చేయని నేరానికి ఓ ఆరేండ్ల బాలిక బలైన విషాద ఘటన నగర శివారులోని పోచారంలో చోటు చేసుకుంది. తనతో పరిచయమమున్న మహిళ మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని ఆ యువకుడు తట్టుకోలేక పోయాడు. ఆ మహిళపై కోపాన్ని ఆమె కూతురు ఆద్యపై చూపించాడు. చిన్నారిని అత్యంత పాశవికంగా గొంతు కోసి చంపేశాడు.

ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం..యాదాద్రి జిల్లా భువనగిరి ప్రాంతానికి చెందిన కళ్యాణ్, అనూష దంపతులు. వీరు దాదాపు రెండు సంవత్సరాలుగా ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఇస్మాయిల్ ఖాన్ గూడ విహారి హోమ్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఆరేండ్ల కూతురు ఆద్య ఉంది. అనూషకు కరుణాకర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అయితే అనూష కొద్ది రోజులుగా కరుణాకర్ ను పట్టించుకోకపోవడంతో కోపం పెంచుకున్న అతడు ఆద్యను అతి కిరాతకంగా సర్జికల్ బ్లేడ్ తో గొంతు కోసి చంపేశాడు. విషయం తెలుసుకొన్న మల్కాజిగిరి ఏసీపీ సర్సింహా రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లకు అనుమతివ్వండి

-కేంద్రానికి మంత్రి సత్యవతి లేఖ

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఏర్పాటు చేయడానికి అంగీకరించిన గిరిజన విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం 2020-21 నుంచి అడ్మిషన్లు చేపట్టి, తరగతులు ప్రారంభించేందుకు అన్ని అనుమతులు వెంటనే ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి గిరిజన సంక్షేమ శాఖల శ్రీమతి సత్యవతి రాథోడ్ లేఖ రాశారు.

గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభం కోసం ఇక్కడి గిరిజన యువత ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారని, వారి భవిష్యత్ దృష్ట్యా ఈ విద్యా సంవత్సరంలో విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ల పక్రియ ప్రారంభించి, తరగతులు చేపట్టేందుకు సహకరించాలని లేఖలో కోరారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం కేంద్రం కోరినట్లు తెలంగాణలోని ములుగు జిల్లా జాకారంలో 335 ఎకరాల భూమిని గుర్తించినట్లు లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి 2018 డిసెంబర్ 31వ తేదీన ఈ ప్రాంతాన్ని సందర్శించి, గిరిజన విశ్వవిద్యాలయం కోసం కేటాయించిన భూమిని పర్యవేక్షించి 2019-20 వ విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయం ప్రారంభించుకోవచ్చని చెప్పారని గుర్తు చేశారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు ద్వారా ఎంతో మంది గిరిజన యువతకు ఉన్నత విద్య లభించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ అందుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని 2020-21 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు చేపట్టి, తరగతులు నిర్వహించేలా వెంటనే అనుమతుల పక్రియను పూర్తి చేయాలని మంత్రి కోరారు.

కోవిడ్ సాయంలో పాల్గొన్న ఐఎన్ఎస్ కేసరి

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): భారత నావికాదళంలో ఒక ప్రధాన మైలురాయి. ఐఎన్ఎస్ కేసరి నౌక 55 రోజుల్లో 75 వేల నాటికల్ మైళ్లు ప్రయాణించి ఐదు దేశాలను చుట్టివచ్చింది. మాల్దీవులు, మారిషస్, మడగాస్కర్, కొమొరోస్, సీషెల్స్ దేశాలకు కోవిడ్-19 సాహాయాన్ని అందించింది. మిషన్ సాగర్ కింద మే 10న ప్రయాణం ప్రారంభించిన ఐఎన్ఎస్ కేసరి జూన్ 28న భారతదేశానికి తిరిగి వచ్చింది. కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో హిందూ మహాసముద్ర పొరుగు దేశాలకు సహాయం అందించడమే ఈ మిషన్ ముఖ్య లక్ష్యం అని విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఐదు దేశాలకు ఆహార పదార్థాలు, మెడిసిన్స్, ఆయుర్వేద మందులు అందజేయడంతో పాటు మారిషస్, కొమెరోస్‌కు వైద్య సహాయక టీంలు పంపించారు. ఐఎన్ఎస్ కేసరికి ఐదు హిందూ మహాసముద్ర దేశాలలో ఆత్మీయ స్వాగతం లభించింది. నౌక మొదటగా మల్దీవులకు చేరుకుంది. అనంతరం మారిషస్‌కు, ఆపై మే నెల చివరి నాటికి మడగాస్కర్‌కు అక్కడినుంచి కొమెరోస్‌కు, అక్కడినుంచి జూన్ 7వ తేదీన సిషెల్స్‌కు చేరుకుంది.

రష్యాలో బలమైన నేతగా ఎదిగిన పుతిన్

స్టాలిన్ తరవాత అంతటి నేతగా ప్రజాదరణ
రాజ్యాంగ సవరణలకు..జనామోదంతో తిరుగలేని నేత

మాస్కో,జులై3(ఆర్ఎన్ఎ): సోవియట్ రష్యా పతాననంతరం రష్యాలో బలమైన నాయకుడిగా వ్లాదిమిర్ పుతిన్ అవతరించారు. సోవియట్ రష్యా పటిష్టతకు అహరహరం కృషి చేసిన స్టాలిన్ కూడా తన పదవిని పదిలం చేసుకున్నారు. ఆధునిక సోవియట్ రాష్యా పునర్నిర్మాణంలో స్టాలిన్ పాత్ర మరువలేనిది. తనదేశం కోసం ఆయన పడ్డ కష్టం అంతాఇంతా కాదు. సోవియట్ రష్యా పటిష్టంగా తయారవడమే గాకుండా శాస్త్ర సాంకేతిక రంగంలో అమెరికాను ఢీకొనేలా నిలబడింది. లెనిన్ విప్లవం సాధిస్తే స్టాలిన్ రష్యాను పటిష్టం చేశారు. తాజాగా ఇప్పుడు పుతిన్ కూడా రాష్యాను మళ్లీ ప్రపంచ దేశాల్లో అగ్రరాజ్యంగా నిలబెట్టడంలో నిరంతరంగా శ్రమిస్తున్నారు. అయితే రష్యా రాజ్యాంగం మేరకు వరుసగా రెండుసార్లు మాత్రమే అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉంది. దీంతో మధ్యలో ఆయన ప్రధాని అవతారం ఎత్తి తన అనుచరుడు మెద్వదేవ్‌ను ఓ టర్మ్ అధ్యక్షుడిగా ఉండేలా ప్రయోగం చేశారు. ఆ తరవాత మళ్లీ పుతిన్ అధ్యక్షుడయ్యాడు. అంతటితో పుతిన్ ఆగిపోతే ఇక మరోమారు ఆయన అధ్యక్షుడిగా ఉండడానికి వీల్లేదు. మాజీ అధ్యక్షుడిగా పుతిన్ ఉండిపోయే వారు. కానీ అలా కాకుండా పుతిన్ తన మేధస్సును ఉపయోగించి శాశ్వతంగా అధికారం లో కొనసాగడం ఎలాగో కనిపెట్టారు. రాజ్యాంగ నిబంధనలు ఎలా ఉన్నా వాటిని అధిగమించి 20 ఏళ్లుగా పుతిన్ అధ్యక్షుడి,గా ప్రధానిగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉంటూ వచ్చారు. అయితే ఇక మళ్లీ అధ్యక్షుడిగా కొనసాగాలంటే ప్రస్తుత రాజ్యాంగం అనుమతించదు. అందుకే పుతిన్... ఇకపై అది సాధ్య పడదని గ్రహించి ఆర్నెల్ల క్రితం ఏకంగా ఆ నిబంధనలనే సవరించారు. 2036 వరకూ తానే అధ్యక్షుడిగా కొనసాగడానికి వీలుకల్పించే ఆ సవరణలపై ప్రజల రిఫరెండం కోరి విజయం సాధించారు. ఇక ఆయన రష్యాకు శాశ్వత అధ్యక్షుడుగా ఉండేందుకు ప్రజలు ఓటేశారు. పుతిన్ తీసుకొచ్చిన సవరణలకు అనుకూలంగా 77.9 శాతంమంది, వ్యతిరేకంగా 21 శాతంమంది ఓట్లేశారని అధికారులు ప్రకటించారు. 2000 సంవత్సరంలో తొలిసారి దేశాధ్యక్ష పీఠం అధిరోహించిన పుతిన్‌కు ప్రస్తుతం 67 ఏళ్లు. ఇప్పుడున్న నిబంధనల్ని అనుసరించి ఆయన 83 ఏళ్లు వయసు వచ్చేవరకూ అధ్యక్ష పదవిలో ఉండొచ్చు. ఈలోగా మరిన్ని సవరణలు తీసుకొస్తే అంతకుమించి కూడా కొనసాగవచ్చు! మొత్తానికి జనవరిలోనే పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగ సవరణలకు అవసరం లేకపోయినా పుతిన్ రిఫరెండం నిర్వహించి జనం కూడా తన వెనకే వున్నారన్న నిరూపించుకోగలిగారు. కేవలం తన పదవి కోసమే సవరణలు చేశారన్న అనుమానం రాకుండా పుతిన్ ఇతర నిబంధనలు కూడా చేర్చారు. సామాజిక సంక్షేమ పథకాలను మెరుగుపరచడం, ఆడా మగా మధ్య జరిగే పెళ్లిని మాత్రమే గుర్తించడం, ఎగ్జిక్యూటివ్ అధికారాల్లో మార్పులు తీసుకొచ్చి అధ్యక్షుడికి అపరిమిత అధికారాలు వుండేలా చూడటం, అంతర్జాతీయ చట్టాలు రష్యా రాజ్యాంగానికి అనుగుణంగా లేకపోతే అవి వర్తించబోవని చెప్పడం ఇతర సవరణల ధ్యేయం. బలమైన నేతలకు రిఫరెండం అనేది ఒక శక్తిమంతమైన ఆయుధంగా పుతిన్ గుర్తించి అమలు చేసుకోగలిగారు. సుస్థిరత, భద్రత కావాలంటే తనకే ఓటేయాలని ఈ రిఫరెండం సందర్భంగా పిలుపునిచ్చారు. ఉగ్రవాద చర్యలు మొదలుకొని అసమ్మతి వరకూ దేన్నయినా అణచడంలో సిద్ధహస్తుడని రుజువైన పుతిన్‌కు దీటైన నేత లేకపోవడం కూడా కలసి వచ్చింది. ఈ రిఫరెండం ద్వారా రష్యాకు తాను తిరుగులేని అధినేతనని పుతిన్ రుజువు చేయ గలిగారు. పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న ఉదారవాద వ్యవస్థ తమకు ఆమోదయోగ్యం కాదని, తమ దేశంలో తాము అనుకునేదే చట్టమని ఆయన ఈ రిఫరెండంతో తేల్చిచెప్పారు. పశ్చిమ దేశాల్లో చాలా భాగం ఇప్పుడు స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టబద్ధతను కల్పించాయి. కానీ తాము మాత్రం సంప్రదాయంగా వస్తున్న కుటుంబ విలువలకే కట్టుబడి వున్నామని, భగవత్ సృష్టిని ధిక్కరించబోమని ఈ సవరణలతో పుతిన్ చాటారు. ఇప్పటికే అమెరికాతోపాటు ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తది తర దేశాల్లో క్రమేపీ బలం పుంజు కుంటున్న మితవాదులకు పుతిన్ మార్గదర్శకుడవుతారు. ఉదారవాద విధానాలకు తామే ప్రత్యామ్నాయమని వారు చెప్పుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. వాస్తవానికి జర్మనీకి చెందిన తీవ్ర మితవాదులకు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో పారా మిలిటరీ శిక్షణనిచ్చినట్టు ఒక నివేదిక బయటపెట్టింది. సారి సామాజిక మాధ్యమాల్లో పుతిన్ వ్యతిరేక ప్రచారం దీటుగానే సాగింది. కానీ పుతిన్ బలపడితే పబ్లిక్ రంగ సంస్థల సిబ్బంది వేతనాలు పెరుగుతాయని, బడుల్లో పిల్లలకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తారని, శిశు సంక్షేమ పథకాలు అమల్లోకొస్తాయని జనం విశ్వసించారు.

రక్షణరంగానికి మరింత ఊపు

బలోపేతం చేసే దిశగా మోడీ చర్యలు
అధునాతన యుద్ధసామాగ్రి సమకూర్చే యత్నాలు

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): భారత్ రక్షణ వ్యవస్థను పటిష్ట పరచడంలో గత ఐదారేళ్లుగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మరింత బలంగా దేశాన్ని తయారుచేసేందుకు ప్రధాని మోడీ కీలక నిర్ణయం తీసుకున్నారు. నక్కజిత్తుల చైనా చర్యలతో ఇక మన రక్షణ రంగాన్ని అభేద్యంగా తయారుచేసే పనిలో పడ్డారు. తమకు తిరుగులేదని భావించి ప్రపంచ దేశాల సరిహద్దులను కబళించే యత్నాల్లో ఉన్న చైనాకు గట్టి బుద్ధి చెప్పేందుకు ఇప్పటికే మన బలగాలు సరిహద్దుల్లో కాచుకుని ఉన్నాయి. భారత్-చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ రక్షణవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రక్షణశాఖ చర్యలు మొదలుపెట్టింది. రక్షణ దళాల సామర్థ్యాన్ని పెంచడంలో భాగంగా రూ.38,900 కోట్లతో 33 యుద్ధ విమానాలు, క్షిపణి వ్యవస్థలు, ఇతర ఆయుధాల కొనుగోలుకు రక్షణశాఖ అనుమతించింది. దీంతో భారత సైన్యం రష్యా నుంచి 21 మిగ్-29 ÷టైర్ జెట్లు కొనుగోలు చేయనుంది. గతంలోనే రక్షణరంగ లొసుగులపై నిపుణులు ఎప్పటినుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. మనం చైనాను ఎప్పటికీనమ్మదగ్గ స్నేహితుడిగా చూడరాదన్న హెచ్చరికలు చేశారు. దీంతో యుద్ధ విమానాల కొనుగోలుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 12 సుఖోయ్-30 ఎంకేఐ ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకోనుంది. ఇదిలావుంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 59 మిగ్-29 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా రక్షణ శాఖ అంగీకరించింది. మరోవైపు 248 అస్త్ర ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్ సిస్టమ్స్‌ను సైతం సైన్యం కొనుగోలు చేయనుంది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. 21 మిగ్-29 ఫైటర్ జెట్ల కొనుగోలుకు, 59 మిగ్-29 ఎయిర్‌క్రాఫ్ట్‌ల అప్‌గ్రేడేషన్‌కు రూ.7,418 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. హెచ్ఏఎల్ నుంచి 12 సూ-30 ఎంకేఐ ఎయిర్‌క్రాఫ్ట్‌లు సమకూర్చుకోవడానికి రూ.10,730 కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నావికా దళం, వైమానిక దళానికి అవసరమైన లాంగ్ రేంజ్ క్రూయిజ్ మిస్సైల్ సిస్టమ్స్, అస్త్ర క్షిపణుల కొనుగోలుకు రూ.20,400 కోట్లకు పైగానే ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఇవన్నీ తాజాగా తీసుకున్న నిర్ణయాలు కాగా గతంలో రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయడం జరిగింది. అవి ఈ నెలాఖరులోగా మనకు చేరనున్నాయి. మరోవైపు సైనిక శక్తిని పెంచి దేశ సరిహద్దుల్లో పటిష్ట భద్రత విషయంలో రాజీపడేది లేదని మోడీ కృతనిశ్చయంతో ఉన్నారు.

బిజెపి నేతలు కరోనా రాజకీయాలు మానాలి

నిధులు ఇచ్చామని బుకాయిస్తే సరిపోదు
కరోనా కోసం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలి
మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): కరోనాపై బిజెపి నేతలు రాజకీయాలు మానాలని, అనవసర విమర్శలు ఆపాలని ఢిల్లీలో అధికార ప్రతినిధి, మాజీకేంద్ర మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. అనవసర విమర్శలతో అసలు నిజాలు దాచలేరని అన్నారు. బిజెపి రాజకీయాలను తెలంగాణ ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. అనవసర విమర్శలతో తమ అసమర్థను వారు కప్పిపుచ్చుకోలేరని అన్నారు.

కేంద్రం దండిగా నిధులు ఇచ్చినా కర్చు చేయలేదంటూ పార్టీ నేతలు రాంమాధవ్, బండి సంజయ్ తదితరులు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. బిజెపి కరోనాను కూడా స్వప్రయోజనాలకు వాడుకుంటోందన్నారు. కరోనా విషయంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి నిరంతరంగా శ్రమిస్తోందని అన్నారు. కరోనాపై పోరులో మంతం÷-రి ఈటెల రాజేందర్ నిరంతరంగా పనిచేస్తున్నారని అన్నారు. సిఎం కెసిఆర్ ఎప్పటికప్పుడు సమీక్షించి ఇస్తున్న ఆదేశాలతో వైద్య సిబ్బంది పనిచేస్తోందన్నారు. కొత్తగా టిమ్స్ ఏర్పాటు వంటివి కూడా కరోనాపై యుద్ధానికే అని అన్నారు. ఇవన్నీ బిజెపి నేతలకు కనిపించడం లేదా అని చారి అన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నప్పుడు దేశంలో రైతులకు ఉచిత కరెంట్ ఎందుకు ఇవ్వలేకఎ ోతున్నారని ప్రశ్నించారు. ఇదిలావుంటే కెసిఆర్ నిర్ణయంతో విపక్షాలకు దిక్కుతోచకుండా పోయింది. కాంగ్రెస్, బిజెపిలకు అసలు అంశం లేకుండా పోయిందన్నారు. సమస్యలను పరిస్కరించడంలో కెసిఆర్‌కున్న చిత్తవుద్ది బిజెపి నేతలకు ఎక్కడిదన్నారు. తెలంగాణలో వివిధ కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా దేశ వనరులను కాంగ్రెస్, బీజేపీ ఉపయోగించుకోలేక పోయిందని వ్యాఖ్యానించారు. వామ పక్షాలు అభిప్రాయ భేదాలు పక్కన పెట్టి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలుగు ప్రజలు అందరూ మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగి వేసారి పోయారన్న చారి ..కుంభకోణాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్ అయిందన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్న మాజీమంత్రి.. వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. కరోనాను ఎదుర్కోవడంలో కేంద్రం తోణమే నిధులు ఇచ్చి రాష్ట్రాలను ఆదుకోవాలన్నారు. కరోనాతో పోరాడేందుకు నిధులు కేటాయించాలన్నారు. వలసకూలీలను కూడా తమ ఖర్చులతో పంపించామని అన్నారు.

ప్లాస్మా బ్యాంక్‌కు శ్రీకారం

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ రోజురోజుకూ కోవిడ్-19 పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. కరోనా కట్టడి చర్యల్లో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్

ఎస్సారెస్పీకి కాళేశ్వర నీరు

సిఎం ఆదేశాలతో అధికారుల విడుదల

నిజామాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): వానాకాలం సాగు దృష్ట్యా ఎస్సారెస్పీ వరద కాలువను నింపాలని సిఎం కెసిఆర్‌ను కలిసి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విజ్ఞప్తిచేయడంతో దీనికి ముఖ్యమంత్రి వెంటనే స్పందించి వరద కాలువను కాళేశ్వరం నీటితో నింపాలని ఇరిగేషన్ అధికారి, కాళేశ్వరం సీఈ నల్లా వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. సిఎం ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు సుమారు 100 కి.మీల మేర ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువను కాళేశ్వరం నీటితో నింపారు. వరద కాలువలోకి 1 టిఎంసి నీటిని లింక్ నంది పంప్‌హౌస్ ద్వారా కరీంనగర్‌లో అధికారులు విడుదల చేశారు. రైతుల కోరిక మేరకు అడిగిన వెంటనే కాలువలోకి నీటిని నింపినందుకు మంత్రి వేముల సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సారెస్పీ వరదకాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు అప్రమత్తం కావాలని, సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఆయకట్టు రైతాంగం పక్షాన మంత్రి వేముల సిఎం కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వరద కాలువలోని సాగునీటి ద్వారా పెద్ద ఎత్తున ఆయకట్టు

రైతులకు లబ్ది చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక రైతుగా సాగుటి కష్టాలు, అవసరాలు తనకు తెలుసని, అందులో భాగంగానే సిఎంను కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేశానని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రైతుల గోసను తీర్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం విషయంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. రైతేరాజు అన్న నినాదాన్ని ఆచరణలో చూపెడుతున్న సిఎం కెసిఆర్ నిరంతరం రైతుల శ్రేయస్సు కోసం పరితపిస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ పదవులపై నేతల గురి

-మోపిదేవి సీటు కోసం పులువురి ఆశ

గుంటూరు,జులై3(ఆర్ఎన్ఎ): మండలి రద్దు ప్రకటనతో నిరాశలో ఉన్న జిల్లా నేతల్లో ఎమ్మెల్సీ పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. మండలి రద్దుకు చట్ట పరంగా బ్రేకులు పడటంతో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే డొక్కా మాణజక్య ప్రసాద్ ఓ సీటును గెలిచారు. వైసీపీ తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు ఆ అవకాశం దక్కింది. మంత్రి మోపిదేవి రాజ్యసభకు ఎంపికవడంతో ఆయన ఇప్పటి వరకు కొనసాగిన ఎమ్మెల్సీ పదవి ఖాళీ అయింది. దాంతో పాటు మరో మూడు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. కనీసం జిల్లాకు ఒకటైనా దక్కుతుందనే ఆశతో వైసీపీ నేతలు తిరిగి పావులు కదుపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సామాజిక సమీకరణల్లో భాగంగా ఎమ్మెల్యేలుగా పోటీ అవకాశం కోల్పోయిన ముఖ్య నేతలకు ఆనాడు అధినేత జగన్ ఇచ్చిన హామీతో తెరపైకి వస్తున్నారు. తొలివిడత ఖాళీలలోనే ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని ఆశించిన నేతలకు మోపిదేవి మొదట్లో అడ్డం పడ్డారు. తాజా పరిణామాలతో మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌కు అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిని చేస్తానని రాజశేఖర్‌కు జగన్ హామీ ఇచ్చారు. ఇక గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సీటును త్యాగం చేసిన లేళ్ల అప్పిరెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ పదవిపైనే ఆశలు పెట్టుకున్న అప్పిరెడ్డి వేరే ఏ పదవిని కూడా ఆశించలేదు. తాజా పరిణామాలతో రాజశేఖర్, అప్పిరెడ్డిల్లో ఆశలు చిగురించాయి.

శాకంబరిగా కనకదుర్గమ్మ

విజయవాడ,జులై3(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో శాకంబరీ ఉత్సవాలను ప్రారంభించారు. వివిధ రకాలైన కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. మూడు రోజులపాటు శాకంబరీ దేవిగా అమ్మవారి దర్శనం లభించనుంది. రోజుకి ఆరు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా తీసుకునే వెసులుబాటును దేవస్థానం అధికారులు కల్పించారు. దుర్గమ్మకు నేటి నుంచి మూడురోజులపాటు శాకంబరి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.వి.సురేష్‌బాబు తెలిపారు. వివిధ రకాలైన కూరగాయలతో అమ్మవారి అలంకారం జరుగుతుందని, మూడు రోజుల పాటు అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిస్తారని తెలిపారు.

కర్నూలు ప్రజాప్రతినిధులకు కరోనా

-ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి కుటంబానికి పాజిటివ్

కర్నూలు,జులై3(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కరోనా ఏదో ఒక విధంగా విజ్రుంభిస్తూనే ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రోజు రోజుకు కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రతి రోజు వెయ్యికి దగ్గరలో కరోనా కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇటీవల చాలా మంది ప్రజా ప్రతినిధులు కూడా కరోనా బారిన పడిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఏపీ శాసనమండలి విప్, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆయన భార్యకు, అలాగే వారి కుమారుడు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి కరోనా సోకింది. వారి ఇంటిలో పనిమనిషికి కరోనా పాజిటివ్ గా నిర్ధారణ అయిందని అంటున్నారు. ప్రస్తుతం వీరందరూ హైదరాబాద్‌లో హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇటీవల విజయవాడ వెళ్లినప్పుడు అక్కడ కరోనా సోకినట్లు తెలుస్తోంది.

కరోనాబారిన పడ్డవారికి పోస్టల్ బ్యాలెట్

-ఎన్నికల సంఘం పరిశీలనలో నిర్ణయం

న్యూఢిల్లీ,జులై2(ఆర్ఎన్ఎ): ఇకపై వృద్ధులతోపాటు కరోనా రోగులు కూడా పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా ఓటు వేయవచ్చు. కరోనా సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు ఎన్నికల నియమాల ప్రవర్తన, 1961 చట్టాన్ని సవరించింది. ఇప్పటి వరకు సైనిక దళాలకు చెందిన వారు, ఎన్నికల విధుల్లో ఉన్న వారు బ్యాలెట్ విధానం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. అయితే కరోనా నేపథ్యంలో వైరస్ బారినపడినవారు, 65 ఏండ్లు పైబడిన వారు బహిరంగ ప్రదేశాల్లో తిరుగడం మంచిది కాదని ఆరోగ్య రంగానికి చెందిన పలువురు ప్రభుత్వానికి సూచించారు. మరోవైపు ఈ ఏడాది అక్టోబర్ నెలలో బీహార్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఎన్నికల నియమాల ప్రవర్తన చట్టానికి సవరణ చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఆలన వాహనానికి జెండా ఊపిన కలెక్టర్

నిర్మల్,జులై2(ఆర్ఎన్ఎ): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు అవసరమైన ప్రత్యేక వైద్య చికిత్స అందించేందుకు ఆలన వాహనం ప్రారంభించామని జిల్లా కలెక్టర్ ముషర్రఫ్ ఫారూఖీ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆలన వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఇంటిపట్టునే ఉంటున్న వయోవృద్ధులకు జిల్లా దవాఖానలో వైద్య నిపుణులచే చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలన వాహనాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వాహనంలో డాక్టర్ తో పాటు ఏఎన్ఎం, సిబ్బంది ఉంటారని, ప్రతి గ్రామంలో పక్షవాతం, టీబీ వంటి ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించి జిల్లా దవాఖానలో వైద్య నిపుణులచే చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.వసంత్ రావు, డా.కార్తీక్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, నాయకులు రాంకిషన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసీంగుప్తా భార్యకు కోటి చెక్కు అందించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): కోవిడ్-19తో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ అసీం గుప్తా కుటుంబానికి రూ.1 కోటి నష్ట పరిహారం చెక్కును ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవ్రాల్ శుక్రవారం అందజేశారు. ఎల్ఎన్‌జేపీ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్‌గా డాక్టర్ అసీం పని చేసేవారు. ఆయన సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో డాక్టర్ గుప్తా ప్రముఖ అనస్థీషియా నిపుణుడని తెలిపింది. ఆయన విధి నిర్వహణలో ఉండగా కోవిడ్-19 సోకినట్లు పేర్కొంది. జూన్ 6న ఆయనకు కోవిడ్-19 పాజిటివ్ అని నిర్ధరణ అయిందని తెలిపింది. ఆయనను క్వారంటైన్‌కు తరలించారని, వ్యాధి లక్షణాలు తీవ్రమవడంతో జూన్ 7న తమ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స చేసినట్లు తెలిపింది. డాక్టర్ గుప్తా కోరిక మేరకు ఆయనను సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపింది.

థియేటర్లలో బొమ్మ పడేదెప్పుడో?

ఎదురు చూస్తున్న ప్రేక్షకులు
ఆకలితో అలమటిస్తున్న కార్మికులు
తీవ్ర నష్టాల్లో సినీ, అనుబంధ పరిశ్రమలు

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): మనదేశంలో సినిమా థియేటర్లకు, ప్రజలకు మధ్య విడదీయరాని అనుబంధం ఉంది. సినిమాను థియేటర్ల్‌ఓనే చూసి పొందే అనందం అంతాఇంతా కాదు. అలాంటి సినిమాను బుల్లితెరపై చూసి ఆనందించడం అన్నది ఊహించుకోలేక పోతున్నారు. కరోనా నేపథ్యంలో ఇప్పుడు థియేటర్ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో దీనిని నమ్ముకున్న ప్రేక్షకులు ఆనందానికి దూరం అయితే ..వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయారు. వినోదం లేకపోవడంతో అనుబంధ రంగాలు కూడా కుదేలయ్యాయి. దీంతో థియేటర్లు తెరుచుకునే దెప్పుడో అని సగటు ప్రేక్షకుడు ఎదురు చూస్తున్నాడు. కళకళలాడాల్సిన సినిమా థియేటర్లు కరోనా దెబ్బకు మూన్నెళ్లుగా తెరుచుకోవటం లేదు. ప్రతిరోజు ప్రేక్షకుల సందడితో కన్పించే సినిమా థియేటర్లు బోసిపోయి కనిపిస్తూనాన్నయి. కొత్త సినిమా వచ్చిదంటే ప్రేక్షకులు, అభిమానులతో కిక్కిరిసిపోయే సినిమా హాళ్లు కళావిహీనంగా మారాయి. పిల్లలు, పెద్దలకు వినోదం అందించే చోట పనిచేసే సినీకార్మికుల కష్టాలు అంతాఇంత కాదు. ఏళ్ల తరబడి ఇదే వృత్తిలో కొనసాగుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. థియేటర్ల మూసివేతతో వీరికి కుటుంబ పోషణ గగనమైంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో కొన్నింటికి ఆంక్షలు సడలించినా థియేటర్లకు మాత్రం మినహాయింపు ఇవ్వలేదు. మూసివేత కారణంగా మూడునెలల కాలంలో ఒక్కో థియేటర్ సుమారు లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోయింది. ఈనేపథ్యంలో థియేటర్ల యాజమాన్యం సినీకార్మికులు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేమని చేతులు ఎత్తేసింది. మరికొన్ని యాజమాన్యాలు అయితే విధుల నుంచే తొలగించడంతో ఎన్నో ఏళ్లు సినిమా టాకీస్‌లనే నమ్ముకుని జీవనం సాగించిన వారి పరిస్థితి దారుణంగా మారింది. ఒక్కో టాకీస్‌లో 20 మంది వరకు విధులు నిర్వహిస్తుంటారు. థియేటర్‌లో ఆపరేటర్, బుకింగ్ కౌంటర్‌లో ఉద్యోగులు, గేటు కీపర్లు, రివైండర్, స్వీపర్లు, స్కావెంజర్, వాచ్‌మెన్‌లు, మేనేజర్‌లతో పాటు సైకిల్‌స్టాండ్, క్యాంటీన్‌లో తినుబండరాలు అమ్మేవారు కనీసం నలుగురైదుగురు ఉంటారు. వీరి సంఖ్య దాదాపుగా 200కు మించి ఉంటుందని తెలుస్తోంది. వీరిలో ఏళ్ల తరబడి థియేటర్లను నమ్ముకుని పనిచేసే వారు సగానికి పైగానే ఉన్నారు. ప్రస్తుత కరోనా ప్రభావంతో థియేటర్ల మూసివేతకు నిర్ణయం తీసుకోవడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రేపోమాపో బొమ్మపడక పోదా.. అనే గంపెడు ఆశతో వేతనం లేకపోయినా థియేటర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. షాపింగ్ మాల్స్, మార్కెట్లు, ఆఫీసులు మొదలైన వాటిని ఓపెన్ చేసుకోవడానికి పర్మిషన్లిచ్చిన ప్రభుత్వం, సినిమా థియేటర్లను ఓపెన్ చేసుకోవడానికి మాత్రం అనుమతి ఇవ్వలేదు. లాక్‌డౌన్‌తో ఇప్పటికే భారీగా నష్టపోయామని, అనుమతులివ్వడంపై తొందరగా నిర్ణయం తీసుకోవాలని సినిమా థియేటర్స్, మల్టీప్లెక్స్ సెక్టార్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి సినిమా థియేటర్లే వెన్నెముక. ఈ ఇండస్ట్రీపై పది లక్షల మందికి పైగా ఆధారపడి బతుకుతున్నారు. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, యూఏఈ, అమెరికా వంటి దేశాలలో సేఫ్టీ ప్రొటోకాల్స్‌ను మెయింటైన్ చేస్తూ సినిమా థియేటర్లను ఓపెన్ చేసుకోవడానికి అవకాశమిచ్చారని సమాచారం. ఇతర సెక్టార్ల మాదిరిగానే కంటైన్‌మెంట్ జోన్లను మినహాయించి మిగిలిన చోట్ల ఓపెన్ చేసుకోవడానికి తమకూ అవకాశం ఇవ్వాలని ఈ పరిశ్రమ కోరుతోంది. మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్లలో జనాలను అదుపు చేయడానికి, సోషల్ డిస్టెన్సింగ్‌ను పాటించడానికి వీలుండదని ప్రభుత్వం వాదిస్తోంది. సినిమా థియేటర్లు రెండు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. మరోవైపు స్పాట్ బాయ్స్ నుంచి మేకప్ ఆర్టిస్టులు, డిజైనర్లు, ముజిషియన్లు, డైరెక్టర్లు, యాక్టర్లు వరకు 10 లక్షల మంది సినిమా ఇండస్ట్రీపై ఆధారపడి బతుకుతున్నారు. ఈ ఫిల్మ్ ఇండస్ట్రీ 60 శాతానికి పైగా సినిమా థియేటర్లపైనే ఆధారపడి ఉందని, తమకు అనుమతులివ్వడంతో ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా తిరిగి కోలుకోవడానికి వీలుంటుందని పేర్కొంటున్నారు. ఒకవేళ ప్రభుత్వం అనుమతులిచ్చినా సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్ సెక్టార్ తిరిగి కోలుకోవడానికి సుమారుగా 36 నెలల టైమ్ పడుతుందని చెప్పారు. థియేటర్లు బంద్ ఉండడంతో తాజాగా కొన్ని సినిమాలను డైరక్ట్‌గా అమెజాన్, నెట్‌ఫ్లిక్స్ వంటి ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లోనే రిలీజ్ చేస్తున్నారు.

రసవత్తరంగా వైకాపా రాజకీయాలు

కొరుకుడు పడని ఎంపి రఘురామ కృష్ణంరాజు తీరు
అనర్హత వేటును తప్పించుకునేందుకు హైకోర్టులో పిటిషన్

అమరావతి,జులై3(ఆర్ఎన్ఎ): వైకాపా రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. యువ ఎంపి రఘురామకృష్ణరాజు వ్యవహారంతో పార్టీలో జగన్ తొలిసారి సవాల్ ఎదుర్కోబోతున్నారు. తనకు తిరుగులేదన్న తీరుతో ముందుకు సాగుతున్న జగన్ పార్టీలో నిరంకుశంగా ఉంటున్నారని, ఎంపిలు, ఎమ్మెల్యేలకు పార్టీలో స్వేచ్ఛలేదని, సిఎం జగన్‌ను కలవడానికి అపాయంట్‌మెంట్ దొరకదన్న ఆరోపణలు ఉన్నాయి. తాను కలవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదని కూడా రఘురామకృష్ణం రాజు చెప్పుకొచ్చారు. ఆయన

తిరుగబాటుకు ముఇంపు పలకాలని వైకాపా కూడా గట్టిగానే యత్నాలు మొదలు పెట్టింది. ఎంపిపై ఆ పార్టీ ఎంపీలు అనర్హత పిటిషన్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించేందుకు వెళుతుండగా.. రఘురామ కృష్ణరాజు ఓ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టులో పిటిషన్ వేశారు. తనపై అనర్హత, సస్పెన్షన్ చర్యలను అడ్డుకోవాలని ఆయన హైకోర్టును కోరారు. తనకు వేరే పార్టీ లెటర్ హెడ్‌పై షోకాజ్ నోటీసులు ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తాను యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయ్యానని.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లెటర్ హెడ్‌పై షోకాజ్ నోటీసు ఇచ్చారని రఘురామ కృష్ణరాజు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు తాను ఎక్కడా పాల్పడలేదన్నారు. కానీ వైసీపీ ఆ ఎంపీలు అదే కారణం చూపిస్తూ అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు ఢిల్లీ వెళ్తున్నారని పేర్కొన్నారు. అత్యవసర పిటిషన్లను మాత్రమే విచారిస్తున్న హైకోర్టు.. ఎంపీ రఘురామకృష్ణరాజు పిటిషన్‌ను సోమవారం విచారించే అవకాశం ఉంది. తనపై అనర్హత, సస్పెన్షన్ చర్యలు అడ్డుకోవాలని కోరుతూ నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎటువంటి పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడలేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లెటర్ హెడ్‌పై షోకాజ్ నోటీసులు వచ్చాయని ఆయన వివరించారు. యువజన రైతు శ్రామిక పార్టీ తరపున ఎన్నికైనందున ఈ పేరు మీద షోకాజ్ నోటీస్ ఇవ్వలేదన్నారు. అయితే ప్రస్తుతం కరోనా పరిస్థితుల దృష్ట్యా అత్యవసర కేసులు మాత్రమే విచారిస్తన్న హైకోర్టు... సోమవారం ఈ కేసు విచారణ చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అంతకుముందు వైసీపీ ఎంపీలతో పాటు కొందరు న్యాయవాదులు ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లి స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు కేంద్ర పెద్దలను కలవబోతున్నట్లు వచ్చిన వార్తలపై కూడా రఘురామ కృష్ణంరాజు స్పందించారు. వారి ఢిల్లీ పర్యటనతో ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. ఇన్నాళ్లు సీఎం జగన్‌కు తెలియకుండా నడుస్తోందని భావించానని, ఢిల్లీకి ప్రత్యేక విమానంలో ఎంపీలు, న్యాయవాదులను పంపిస్తున్నారంటే.. సీఎం కనుసన్నల్లోనే అంతా జరుగుతోందని స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలు ప్రస్తావించిన వారిని సస్పెండ్ చేస్తే.. పార్లమెంట్‌లో ఎవరూ ఉండబోరన్నారు. తాను పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని మరోసారి స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి భూములు అమ్మొద్దని చెప్పానని, సీఎం జగన్ కూడా ఆ తర్వాత అదే నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇసుక, పేదలందరికీ ఇళ్లు పథకంలో ఉన్న తప్పులను మాత్రమే తాను ప్రస్తావించానన్నారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి గ్రామంలో నిర్మించనున్న రైతు వేదిక భవనానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

రైతు వేదికకు మంత్రి శంకుస్థాపన

మేడ్చల్ మల్కాజ్‌గిరి,జులై3(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మూడుచింతలపల్లి గ్రామంలో నిర్మించనున్న రైతు వేదిక భవనానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి నేడు భూమిపూజ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తరపున మంజూరు అయిన ట్యాంకర్లు, ట్రాక్టర్లను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ హారిక మురళి గౌడ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, స్థానిక రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, జడ్పీటీసీ హరివర్ధన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ సునీతలక్ష్మీ, సర్పంచ్ రవి, అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షం ఎప్పుడో

కరోనా సాయం అందుకోవడంలో ఇబ్బందులు
దరఖాస్తులను పరిశీలించాలంటున్న ప్రజలు

హైదరాబాద్,జులై3(ఆర్ఎన్ఎ): రేషన్‌కార్డుల మంజూరు నిరంతర పక్రియ అని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదు. కనీసం మార్పులు,చేర్పులు కూడా చేయడం లేదని పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు లేనివారు అనారోగ్యం బారిన పడితే ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు అప్పులు చేయాల్సి వస్తోంది. పేదలు రేషన్ కార్డుల ద్వారా వచ్చే సబ్సిడీ బియ్యంతో పాటు విలువైన ఆరోగ్యశ్రీ కార్డులను పొందలేక పోతున్నారు. అనారోగ్యం బారిన పడిన వాళ్లు వైద్యం కోసం వేలాది రూపాయలు అప్పులు చేయాల్సి వస్తోంది. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్డుల మంజూరు పక్రియ పది నెలలుగా నిలిచి పోయింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసినట్లయితే మరికొంత మందికి ప్రయోజనం కలగనుంది. కరోనా నేపథ్యంలో ఉచిత బియ్యం పొందాలనుకున్న వారికి కార్డుఉల లేకపోవడంతో అన్యాయం జరుగుతోందన్నారు. తమకు తాత్కాలికంగా అయినా కార్డులు మంజూరు చేయాలని అంటున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో రేషన్ కార్డుల మంజూరులో అవకతవకలు జరిగాయని పాత వాటిని రద్దు చేసి కొత్తగా దరఖాస్తులను స్వీకరించి కార్డులను మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది చేర్పులు, మార్పుల కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆహార భద్రత కార్డు రేషన్ బియ్యం, ఇతర వస్తువులు తీసుకునేందుకు ప్రభుత్వ పరంగా సబ్సిడీ పథకాల ద్వారా లబ్ది పొందేందుకు, వివిధ రకాల రుణాలను పొందేందుకు ఉపయోగపడుతూ ఉంటుంది. ఇప్పటి వరకు రేషన్ కార్డు లేని వాళ్లు, ఉమ్మడి కుటుంబాల నుంచి వేరు పడి జీవిస్తున్న వాళ్లతో పాటు నూతనంగా వివాహాలు చేసుకున్న వారు నమోదు చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు నేరుగా ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లోకి వెళ్తాయి. ఆయన విచారణ కోసం ఆర్ఐల లాగిన్‌కు పంపిస్తారు. విచారణ అనంతరం రేషన్‌కార్డు మంజూరు చేస్తారు. కానీ ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరు పక్రియను తాత్కాలికంగా నిలిపి వేయడంతో కొత్తవి మంజూరు కావడం లేదు. కరోనాతో పిపుడు ఆ ఊసే లేకుండ పోయింది. రేషన్ కార్డుల ద్వారా బ్దిదారులు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే రేషన్ తీసుకుంటున్నారు.

తిరుమల ఉద్యోగుల్లో కరోనా కలకలం

పదిమందికి వైరస్ సోకినట్లు అనుమానం
అందరికీ పరీక్షలు చేయించి హోం క్వారంటైన్

తిరుమల,జులై3(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ సడలింపులు ఇచ్చిన తర్వాత తిరుమల వెంకన్న దర్శనానికి భక్తులు క్యూ కడుతున్నారు. ప్రత్యేక ఏర్పాట్లు చేసిన టీటీడీ వైరస్ వ్యాప్తి చెందకుండా భౌతిక దూరం పాటిస్తూ.. దర్శనానికి అవకాశం కల్పించారు. అయినా కూడా కరోనా కలకలం సృష్టిస్తోంది. తాజాగా టీటీడీలో 10 మందికి వైరస్ సోకింది. వీరిలో స్వామివారికి పూజా కైంకర్యాలు చేసే అర్చకుడికి కూడా లక్షణాలు బయటపడటంతో కలకలం నెలకొంది. వెంటనే అధికారులు అప్రమత్తమై శానిటైజేషన్ పనులు పూర్తి చేశారు. వైరస్ సోకిన వారిలో నలుగురు సన్నాయి వాయిద్యకారులు, ఓ అర్చకుడు,ఐదుగురు సెక్యూరిటీ గార్డులు ఉన్నట్టుగా వెల్లడించారు. దశల వారీగా ఉద్యోగులకు కరోనా పరీక్షలు చేస్తుండగా.. తాజాగా వీరి శాంపిల్స్‌ను పరీక్షించారు. అందులో పాజిటివ్ అని తేలింది. వారందరినీ వెంటే ఆసుపత్రులకు తరలించారు. వారి కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సూచించారు. ఇప్పటికే తిరుమలకు వచ్చే భక్తులందరికీ అలిపిరిలోనే థర్మల్ స్క్రీనింగ్ ను చేస్తున్నారు. అనారోగ్యంగా ఉన్నవారిని పైకి అనుమతించడం లేదు. వరుసగా టీటీడీలో సిబ్బందికి కరోనా సోకడం భక్తులను కూడా అయోమయానికి గురి చేస్తోంది.

మరోమారు శ్రీవారిని దర్శించుకున్న తమ్మినేని

తిరుపతి పర్యటలనో ఉన్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం తిరుమలలోని శ్రీవారిని మరోమారు దర్శించుకున్నారు. నాలుగురోజుల పర్యటనలో భాగంగా ఆయన తిరుపతి, తిరుమలలో పర్యటిస్తున్నారు. గురువారం కుటుంబసమేతంగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న స్పీకర్ శుక్రవారం మరోసారి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలంతా హర్షిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతిపక్షనేతగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి తగిన సలహాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వంపై విమర్శలు చేయవద్దని, చంద్రబాబు అంటే తమకు గౌరవం ఉందని ఆయన అన్నారు.

ఎపిలో పెరు

రైతుబంధు అందకపోతే అధికారులపై చర్య

అర్హత ఉన్న వారందరికీ అందించాలి
మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాలు

వనపర్తి,జులై3(ఆర్ఎన్ఎ): రైతుబంధు పథకం కింద అర్హత ఉండి రైతుబంధు రాకపోతే.. సంబంధిత అధికారులపై చర్యలు చేపడుతామని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 55 లక్షల ఐదు వేల మంది రైతులకు సంబంధించిన కోటి 40 లక్షల ఎకరాల భూమికి వర్తించే విధంగా ఏడు వేల కోట్ల రూపాయలను సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట మండలం, మదనపూర్, అడ్డాకుల మండలాల్లోని పలు గ్రామాల్లో రైతు వేదికల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసి తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగామంత్రి మాట్లాడుతూ కరోనా వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించి పోయిందన్నారు. అయినప్పటికీ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ రైతులకు ఇబ్బందులు కలగకుండా.. రైతుబంధు కింద రైతు ఖాతాలలో నగదు వేశారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 55 లక్షల 5 వేల మంది రైతుల ఖాతాలలో నిధులు జమ చేయగా, ఇంకా రైతుబంధు రావాల్సిన వారు నాలుగు లక్షల పైన ఉన్నారని తెలిపారు .పేర్లు సరిగా లేకపోవడం, బ్యాంకు ఖాతాలు తెరవకపోవటం వంటి కారణాల వల్ల వీరికి రైతుబంధు జమ కాలేదని తెలిపారు. అయితే న్యాయబద్ధంగా రైతు బంధుకు అర్హత ఉండి రాన్లటైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా వారి పరిధిలోని ఐదు వేల ఎకరాలకు సంబంధించి సంపూర్ణ సమాచారాన్ని, రైతుల సమాచారంతో సేకరిస్తామని తెలిపారు. రైతులు ఎప్పటిలాగే సాధారణ పంటలు సాగు చేయకుండా వాణిజ్య పంటల పై దృష్టి సారించాలని, ముఖ్యంగా కూరగాయలు సాగు చేయాలని సూచించారు. హరితహారం అందరూ మొక్కలు నాటాలని సూచించారు.

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పలు గ్రామాల్లో రైతువేదికలకు శంకుస్థాపనలు చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి

ప్రతిపక్షనేతలకూ రైతుబంధు

రైతుబంధు రాదని చెప్పిన ప్రతిపక్ష నేతలకూ రైతుబంధు డబ్బులు అందాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం పాలెం గ్రామంలో రైతు వేదిక నిర్మాణానికి మంత్రి నేడు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి, కలెక్టర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతాంగం సంతోషంగా ఉన్నారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. 55 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయినట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా రైతుబంధు అందని వారు అధికారులను సంప్రదించాల్సిందిగా సూచించారు. కాళేశ్వరం కాలువకు గండి పడితే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రైతులకు జరుగుతున్న మేలును ప్రతిపక్షాలు గుర్తించడం లేదన్నారు. మీ హాయంలో సాగునీరు ఏపాటి ఇచ్చారో గుర్తుచేసుకోవాలని పేర్కొన్నారు.

టిఆర్ఎస్ కార్యకర్త భార్యకు చెక్కు

జిల్లాలోని పెబ్బేరు మండలం తోమాలపల్లికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త రవీందర్ రెడ్డి ఇటీవల మరణించారు. అతడికి పార్టీ సభ్యత్వం ఉండటంతో ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును రవీందర్ రెడ్డి భార్య నాగలక్ష్మికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపత్కాలంలో కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు

జాబ్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఆప్కాస్

ఇకనుంచి అన్ని శాఖల్లో ఆప్కాస్ ద్వారా నియామకాలు
ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాల కల్పన
47 వేల మందికి పైగా జాబ్ సోర్సింగ్ ఉద్యోగులకు లబ్ది
లాంఛనంగా ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్

అమరావతి,జులై 3(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో కీలక హామీని నెరవేర్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు సరికొత్త విధానాన్ని రూపొందించింది.

ఇప్పటిరకు ఆయా ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్, జాబ్ సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండగా ఇకపై ప్రభుత్వమే ఏపీ కార్పొరేషన్ ఫర్ జాబ్ సోర్స్‌డ్ సర్వీసెస్(ఆప్కాస్) ద్వారా భర్తీ చేయనుంది. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆప్కాస్‌ను సిఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. స్కిల్డ్, సెమి స్కిల్డ్, అన్ స్కిల్డ్ మ్యాన్‌పవర్‌ను గుర్తించి వివిధ శాఖలు, సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆప్కాస్‌లో నియమించబడ్డ వారికి ఈపీఎఫ్, ఈఎస్ఐ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 47 వేల మందికి పైగా జాబ్ సోర్సింగ్ ఉద్యోగులకు లబ్ది జరుగనుందని తెలిపారు. ఉద్యోగాల నియమకాల్లో లంచాల మాట ఉండకూడదని అన్నారు. తాను చేపట్టిన పాదయాత్రలో జాబ్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలను విన్నవించుకున్నారని వివరించారు. ఆప్కాస్ ఏ మాత్రం లాభాపేక్ష లేకుండా పనిచేస్తుందని వెల్లడించారు. ఇప్పటికే జాబ్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించబోమని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల ప్రకారం నియమకాలు ఉంటాయని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఓ సంస్థను ఏర్పాటు చేయాలని భావించిన సీఎం దానికి అనుగుణంగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా జాబ్ సోర్సింగ్ వ్యవస్థను తీసుకొచ్చారు. ఆప్కాస్ ప్రారంభం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగాలు పొందిన పలువురితో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ముచ్చటించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'పాదయాత్ర సమయంలో ఎంతో మంది కాంట్రాక్టు ఉద్యోగులు నా వద్దకు వచ్చి వారి బాధలను పంచుకున్నారు. ఇస్తామన్న జీతాలు ఇవ్వకుండా కోతలు విధించారని విలపించారు. ఉద్యోగాలు రావడానికి, జీతాలు ఇవ్వడానికీ లంచం తీసుకున్నారు. రాష్ట్రంలో ఏ మూలకు పోయినా ఇదే మాట వినిపించేది. టీడీపీ హయాంలో అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేశారు. గత ప్రభుత్వం వారిని నిలువునా దోచుకుంది. దీనిని రూపుమాపాలని ఆప్కాన్‌ను రూపొందించాం. అలాగే మహిళలకూ 50 శాతం ఉద్యోగాలు దక్కే విధంగా దీనిని అమలు చేస్తాం. కార్పొరేషన్ ఫర్ జాబ్ సోర్స్‌డ్ సర్వీసెస్‌కు చైర్మన్‌గా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా ప్రభుత్వ కార్యదర్శి వ్యవహరిస్తారు. దీంతో ఎక్కడా కూడా అవినీతి చోటుచేసుకునే అవకాశం ఉండదు. జీతాలు, ఉద్యోగాల్లో ఎక్కడా చేతివాటాలకు అస్కారం లేదు. జాబ్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత ఉంటుంది.

ప్రతి ఒకనెలా 1వ తేదీనే జీతం చెల్లిస్తాం. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి విధానాలు కచ్చితంగా పాటిస్తాం. ఎటువంటి లంచాలు, వివక్ష లేకుండా జీతాలు వారి చేతుల్లోకే వస్తాయి. ప్రస్తుతానికి 50,449 మందికి నియామక పత్రాలు ఇస్తాం. ఈ సంఖ్యను వచ్చే రోజుల్లో పెంచుతాం. ఆప్కాస్‌పై కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీవ్ర దోపిడీకి గురయ్యామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ భద్రతపై నమ్మకం ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రులు, సిఎన్ నీలం సాహ్ని తదితరులు పాల్గొన్నారు.

హరితహారంతో వెల్లివిరుస్తున్న పచ్చదనం : మంత్రి అల్లోల

యాదాద్రి భువనగిరి, జులై 3: అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం అనే మహోత్తర కార్యక్రమాన్ని చేపట్టారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లాలోని రాయిగిరిలో ఆంజనేయ అరణ్యం, నర్సింహా అర్బన్ ఫారెస్ట్ పార్కులను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆంజనేయ అరణ్యంలో కాలి నడకన తిరుగుతూ సందర్శకుల కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలు, పునరుద్ధరించిన అటవీ ప్రాంతాన్ని వ్యూ పాయింట్ నుంచి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హరితోద్యమ కార్యక్రమాన్ని చేపట్టారని, దీంతో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. హరితహారం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనే..మరోవైపు అడవులను కాపాడుకునేందుకు అత్యంత కఠినంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్ నలువైపులా, ఇతర పట్టణాలకు దగ్గర్లో ఉండే అటవీ భూములను గుర్తించి వాటిలో కొంత భాగాన్ని అర్బన్ లంగ్ స్పేస్‌లుగా, అర్బన్ ఫారెస్ట్ పార్కు లు, ఎకో టూరిజం పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు.

తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదాద్రీశుడి క్షేత్రం ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడికి వచ్చే యాత్రికులతో పాటు ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో రాయగిరి రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో నర్సింహా అరణ్యం, అంజనేయ అరణ్యం అర్బన్ ఫారెస్ట్ పార్క్ లను అభివృద్ధి చేశామన్నారు.

రాయగిరి – ఎ రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో 97.12 హెక్టార్లలో రూ.3.61 కోట్ల వ్యయంతో నర్సింహా అరణ్యం, రాయగిరి –ఎ రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో 56.65 హెక్టార్లలో రూ.2.83 కోట్ల వ్యయంతో అంజనేయ అరణ్యం అర్బన్ ఫారెస్ట్ పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. పిల్లలు పర్యావరణం, అడవుల ప్రాధాన్యతను గుర్తించేలా, వీటిపై అవగాహన కల్పించేలా ఈ పార్కులను రూపుదిద్దారని తెలిపారు. ఆంజనేయ అరణ్యంలోని జలపాతానికి యాదమునికి గుర్తుగా యాదాశ్రీ అని పేరు పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్. శోభ, అదనపు పీసీసీఎఫ్ లు లోకేష్ జైస్వాల్, చంద్రశేఖర్ రెడ్డి, డీఎఫ్ వో డీవీ రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ లాక్ 2.0 కు సంబంధించి మార్గదర్శకాలు విడుదల
కరోనా వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి చర్యలు

అమరావతి,జులై3(ఆర్ఎన్ఎ): ఏపీలో కరోనా నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. తాజాగా కరోనా నివారణచర్యలు, అన్ లాక్ 2.0 కు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేసింది రాష్ట్ర ప్రభుత్వం. కేంద్ర మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో కరోనా వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. వైరస్ వ్యాప్తి నివారణ కోసం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ నీలం సాహ్నీ ఆదేశాలు జారీచేశారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివిధ ఉత్తర్వుల మేరకు అన్‌లాక్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 31వ తేదీ వరకూ అన్ లాక్ 2.0 ను అమలు చేయాలని కేంద్రం సూచించింది. కోవిడ్ ఆర్డర్స్ 52, 53, 55 మేరకు రాష్ట్రంలోకి ప్రయాణికులను నియంత్రించాలని ఆదేశాలిచ్చింది. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పోలీసులు, కమిషనర్లు, ఎస్పీలు, డిఎం హెచ్ఓలు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు,ఎంఆర్ఓలు, ఎంపీడీవోలకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఆదేశాలిచ్చారు.?కంటైన్ మెంట్ జోన్లలో నిబంధనలు అమలు చేయాలి. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు కంటైన్ మెంట్ జోన్ల విషయంలో అప్రమత్తంగా వుండాలి. అన్ లాక్ 2 ప్రకారం విద్యాసంస్థలు, సినిమా హాళ్లు, జిమ్‌లు, మెట్రో రైలు సర్వీసులు మరో నెల రోజుల పాటు మూసివేసే ఉంటాయి. కంటైన్మెంట్ జోన్లలో ఆంక్షల్ని కఠినంగా అమలు చేయాల్సి ఉంటుంది. హోం ఐసోలేషన్ మార్గదర్శకాలివే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినప్పటికీ..హాస్పిటల్స్‌లో చేరకుండా ఇంటి వద్దే ఉండి ట్రీట్మెంట్ పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను ఏపీ సర్కార్ ఖరారు చేసింది. ఈ మేరకు హోం ఐసోలేషన్ మార్గదర్శకాలను విడుదల చేసింది.?ఇంట్లో ఉన్నప్పుడు ఏ చిన్న ఇబ్బంది తలెత్తినా...వెంటనే టోల్‌ఫ్రీ (0866-2410978) నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.

అత్యవసర పరిస్థితులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తితే టోల్‌ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి మెడికల్ హెల్ప్ పొందవచ్చు.?రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు ఆహారంలో బ్రౌన్‌రైస్, గోధుమలు, చిరుధాన్యాలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.ఏపీలో కరోనా వైరస్ నిర్దారణ పరీక్షలు పెంచింది. దీంతో కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఏపీలో కొత్తగా 837 కరోనా కేసులు నమోదయ్యాయి. కొత్తగా 9 మరణాలు సంభవించాయి. దీంతో ఏపీలో 16,934కి చేరాయి కరోనా కేసులు. ఇప్పటి వరకు 206కరోనా మరణాలు. ఏపీలో 9,096 యాక్టివ్ కేసులు ఉండగా, 7,632 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు.

కరోనాతో మృతి చెందిన డాక్టర్‌కుకోటి చెక్కును అందచేసిన సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): కరోనా రోగులకు వైద్య సేవలందించే క్రమంలో వైరస్ బారినపడి మరణించిన ఒక డాక్టర్ కుటుంబానికి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఢిల్లీలోని ఎల్ఎన్జేపీ దవాఖానకు చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ అసీం గుప్తాకు కరోనా సోకడంతో జూన్ 28న చనిపోయారు. ఈ ఘటనపై స్పందించిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ ఆ వైద్యుడి త్యాగాన్ని కొనియాడారు. ఆయన కుటుంబానికి రూ.లక్ష పరిహారాన్ని జూన్ 29న ప్రకటించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బాధిత వైద్యుడి కుటుంబాన్ని కేజీవ్రాల్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష రూపాయల చెక్కును వారికి అందజేశారు.

బాలీవుడ్‌లో మరో విషాదం

దిగ్గజ కొరియోగాఫర్ సరోజ్ ఖాన్ మృతి
విషాదంలో మునిగిన ముంబై సినీరంగం

ముంబై,జులై3(ఆర్ఎన్ఎ): బాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. దిగ్గజ కొరియోగ్రాఫర్, జాతీయ అవార్డు గ్రహీత సరోజ్ ఖాన్(72) తుదిశ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులతో బాధపడుతున్న ఆమె బాంద్రాలోని గురునానక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో ఆమె మరణించినట్లు డాక్టర్లు వెల్లడించారు. ఆమె మరణం బాలీవుడ్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. కరోనా నేపథ్యంలో ఆమెకు వెంటనే అంతర్యక్రియలు నిర్వహించారు. సరోజ్ ఖాన్ మృతి పట్ల బాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఉదయం లేవగానే దిగ్గజ కొరియోగ్రాఫర్ సరోజ్‌ఖాన్ ఇక లేరనే విషాదకర వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. అమె కొరియోగ్రాఫీలో డ్యాన్స్ చేయడం చాలా సులభం. ఎవరితోనైనా డ్యాన్స్ చేయించగలరు. సరోజ్ ఖాన్ మరణంగా సినీ ఇండస్ట్రీకి తీరని లోటు. అమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను' అని అక్షయ్ కుమార్ ట్వీట్ చేశారు. మనందరికి శాశ్వత గుడ్‌బై చెప్పి వెళ్లిపోయారు సరోజ్ ఖాన్. మనిషి కేవలం శరీరంతోనే కాదు హృదయంతో,ఆత్మతో నృత్యం చేస్తాడు అని నృత్య కళాకారులకు మాత్రమే కాకుండా యావత్ దేశానికి చాలా అందంగా నేర్పించారు. ఆమె మరణం వ్యక్తిగతంతో ఎంతో తీరని లోటు. ఆమె తియ్యటి తిట్లను కూడా మిస్సవుతాను' అంటూ అనుపమ్ ఖేర్ ట్వీట్ చేశారు.

ఉదయం లేవగానే గుండె పగిలిపోయే విషాదకర వార్త విన్నాను. మీ మరణం సినీ ఇండస్ట్రీకి తీరని లోటు.

ముఖ్యంగా మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని కొరియోగ్రాఫర్‌లుగా మారిన నా లాంటి ఎంతో మందికి ఇది ఎంతో విషాదకర వార్త. మీతో కలిసి డ్యాన్స్ చేయడం, కొరియోగ్రాఫీలో డ్యాన్స్ చేయడం, మీతో కలిసి కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన క్షణాల మరిచిపోలేనివి. డ్యాన్స్‌పై మీకున్న ప్రేమ, అభిరుచి, ప్రతీ పాటకు మీరు కొరియోగ్రాఫీ చేసే విధానం ఎంతో మందికి స్ఫూర్తి. ఇలాంటి విషయాలు మాకు ఎన్నో నేర్పించినందుకు ధన్యవాదాలు. మీరెప్పుడూ మా గుండెల్లో నిలిచిపోతారు. సరోజ్ ఖాన్ కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నాను' అంటూ ప్రముఖ కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా భావోద్వేగ ట్వీట్ చేశారు. దిగ్గజ కొరియోగ్రాఫర్, మూడు సార్లు జాతీయ అవార్డు గ్రహీత సరోజ్ ఖాన్ (72) మరణ వార్త విని షాక్‌కు గురయ్యాను. ఆమె కొరియోగ్రాఫీ చేసిన 2000కు పైగా పాటలు ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఈ విషాద సమయంలో సరోజ్ ఖాన్ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సహచరులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను' అని సరోజ్ ఖాన్ మృతిపట్ల మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

.వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాలపల్లికి చెందిన టీఆర్ఎస్ కార్యకర్త రవీందర్ రెడ్డి భార్య నాగలక్ష్మికి ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందచేసిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

మంత్రి ఎర్రబెల్లి పుట్టిన రోజు సందర్భంగా
నేడు పాలకుర్తిలో మొక్కలు నాటే కార్యక్రమం

వరంగల్,జులై3(ఆర్ఎన్ఎ): పాలకుర్తి నియోజకవర్గంలో శనివారం మంత్రి ఎర్రబెల్లి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక మరితహారంలో మొక్కలు నాటనున్నారు. మంత్రి అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఇందులో పాల్గొనాలని నిర్ణయించారు. పుట్టినరోజు వేడుకలు మొక్కలు నాటడంతో చేపట్టాలని ఇచచిన పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో జన్మదిన వేడుకలకు తాను దూరంగా ఉంటున్నానని, అభిమానులు, కార్యకర్తలు ఎవరూ వేడుకలు నిర్వహించొద్దని కోరారు. ఈనెల 4వ తేదీన జన్మదినం సందర్భాన్ని పురస్కరించుకొని ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 'పుట్టినరోజు అందరికీ పండుగే..కానీ, వేడుకలు జరుపుకునే మంచి వాతావరణం, సామాజిక ప్రశాంతత కూడా ఉండాలి. ప్రస్తుతం కరోనా అందరినీ అతలాకుతలం చేస్తున్నది. అందరూ క్షేమంగా ఉండాలి. అందులో మనం ఉండాలి. అందుకే నేను నా జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని' మంత్రి చెప్పారు. తన జన్మదిన వేడుకల కు బదులుగా ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కని నాటాలి. వాటిని అందరూ సంరక్షించాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు మనమంతా హరితహారంలో పాల్గొందాం. తద్వారా వాతావరణ సమతౌల్యానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి పాటుపడతామని' మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు. దీంతో కార్యకర్తలు ఈ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

యాదాద్రి చుట్టూ పచ్చల హారం
అర్బన్ ఫారెస్ట్ పార్కులతో పర్యాటక అభివృద్ధి
హరితహారం మొక్కల పెంపకంలో పాల్గొన్న మంత్రి

యాదాద్రి భువనగిరి,జులై3(ఆర్ఎన్ఎ): అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం అనే మహోత్తర కార్యక్రమాన్ని చేపట్టారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలన్నారు. యాదాద్రి అభివృద్ధిలో పాల్గొనాలన్నారు. జిల్లాలోని రాయిగిరిలో ఆంజనేయ అరణ్యం, నర్సింహా అర్బన్ ఫారెస్ట్ పార్కులను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఆంజనేయ అరణ్యంలో కాలి నడకన తిరుగుతూ సందర్శకుల కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలు, పునరుద్ధరించిన అటవీ ప్రాంతాన్ని వ్యూ పాయింట్ నుంచి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదాద్రీశుడి క్షేత్రం ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడికి వచ్చే యాత్రికులతో పాటు ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో రాయగిరి రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో నర్సింహా అరణ్యం, అంజనేయ అరణ్యం అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లను అభివృద్ధి చేశామన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హరితోద్యమ కార్యక్రమాన్ని చేపట్టారని, దీంతో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. హరితహారం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనే..మరోవైపు అడవులను కాపాడుకునేందుకు అత్యంత కఠినంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్ నలువైపులా, ఇతర పట్టణాలకు దగ్గర్లో ఉండే అటవీ భూములను గుర్తించి వాటిలో కొంత భాగాన్ని అర్బన్ లంగ్ స్పేస్‌లుగా, అర్బన్ ఫారెస్ట్ పార్కు లు, ఎకో టూరిజం పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. రాయగిరి – ఎ రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో 97.12 హెక్టార్లలో రూ.3.61 కోట్ల వ్యయంతో నర్సింహా అరణ్యం, రాయగిరి –ఎ రిజర్వు ఫారెస్ట్ బ్లాక్ లో 56.65 హెక్టార్లలో రూ.2.83 కోట్ల వ్యయంతో అంజనేయ అరణ్యం అర్బన్ ఫారెస్ట్ పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. పిల్లలు పర్యావరణం, అడవుల ప్రాధాన్యతను గుర్తించేలా, వీటిపై అవగాహన కల్పించేలా ఈ పార్కులను రూపుదిద్దారని తెలిపారు. ఆంజనేయ అరణ్యంలోని జలపాతానికి యాదమునికి గుర్తుగా యాదాశ్రీ అని పేరు పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్. శోభ, అదనపు పీసీసీఎఫ్ లు లోకేష్ జైస్వాల్, చంద్రశేఖర్ రెడ్డి, డీఎఫ్ వో డీవీ రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థిరంగా పెట్రో ధరలు-ముడిచమురు ధరల్లో నిలకడ

న్యూఢిల్లీ,జులై3(ఆర్ఎన్ఎ): పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. దేశీ ఇంధన ధరలు శుక్రవారం కూడా నిలకడగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌లో శుక్రవారం లీటరు పెట్రోల్ ధర రూ.83.49 వద్ద నిలకడగానే ఉంది. డీజిల్ ధర కూడా స్థిరంగానే రూ.78.69 వద్ద కొనసాగుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలు నిలకడగా ఉండటం ఇది వరుసగా నాలుగో రోజు కావడం గమనార్హం. అమరావతిలో కూడా పెట్రోల్, డీజిల్ ధరల పరిస్థితి ఇలానే ఉంది. పెట్రోల్ ధర ధ